

రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇప్పటికే తొలి విడత పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసి రైతాంగం పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను సీఎం చంద్రబాబు చాటిచెప్పారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



బుధవారం 01.07.2026


INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 70 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


## ఖనిజాలకు 'వ్యాల్యూ' పెంచాలి



- మినరల్ మ్యాపింగ్‌కు సీఎం ఆదేశం..
- విలువ జోడింపుతో గరిష్ట ఆదాయంపై దృష్టి..
- ఇసుక తవ్వకాలపై టెక్నాలజీ నిఘా కట్టుదిట్టం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో విలువైన ఖనిజ నిల్వల్ని గుర్తించేలా మినరల్ మ్యాపింగ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. క్రిటికల్ మినరల్స్, బల్క్ మినరల్స్‌తో పాటు విలువైన లోహాలు లభ్యం అయ్యే ప్రాంతాల మ్యాపింగ్ జరగాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వెలికి తీసే ఖనిజాలకు విలువ జోడించేలా ప్రాసెసింగ్ ప్రక్రియను నిర్వహించే అంశంపైనా దృష్టి సారించాలని సూచించారు. క్యాంపు కార్యాలయంలో గనుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ఖనిజ సంపదకు సంబంధించి మార్కెట్ క్యాపిటలైజేషన్ కు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. రాష్ట్రప్రభుత్వ రంగ సంస్థ ఏపీఎండీసీ ద్వారా విలువైన ఖనిజాల మార్కెట్ క్యాపిటలైజేషన్‌కు అవకాశం ఉందన్నారు. దీనిపై నిపుణులతో కలిసి అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

మిగతా 2లో...



## పటిష్టంగా సమాచార నెట్‌వర్క్

- కనెక్టివిటీ టూ లాస్ట్ మైల్ అనేదే లక్ష్యం
- డిజిటల్ లిటరసికి ఆపరేటర్ల సహకారం అవసరం

రాష్ట్రంలో కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

2లో




## జీవితాల్లో మార్పే అసలైన విద్య

- నాణ్యమైన విద్య ప్రతివర్గానికీ చేరాలి..
- ద్రౌపది ముర్ము జీవితం యువతకు స్ఫూర్తి..
- గిరిజన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో మంత్రి లోకేష్

**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే అసలైన విద్య అని, నాణ్యమైన విద్య సమాజంలోని ప్రతి వర్గానికి చేరాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విశాఖ నోవాటెల్ హోటల్ లో జరిగిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవంలో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ వేడుకకు రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ప్రతి తరం ఒక దేశాన్ని వారసత్వంగా స్వీకరిస్తుంది. కానీ ఆ తరం దేశాన్ని ఎలా వదిలి వెళ్తుందో నిర్ణయించేది విద్య. అందుకే విశ్వవిద్యాలయాలు కేవలం డిగ్రీలు అందించే విద్యాసంస్థలు మాత్రమే కావు... అవి కలలకు రూపమిస్తాయి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి, నాయకులను తీర్చిదిద్దుతాయి, తరాల భవిష్యత్తును మార్చేస్తాయి. ఈ రోజు కేవలం ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవం మాత్రమే కాదు... ఇది అవకాశాల, సమ్మిళిత అభివృద్ధి వేడుక. నాణ్యమైన విద్య దేశంలోని ప్రతి మూలకు, సమాజంలోని ప్రతి వర్గానికి చేరాలనే విశ్వాసానికి ప్రతీకగా నిలిచే వేడుక.

మిగతా 2లో...

## పరిశ్రమలకు ఆర్థిక ఊరట

- ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారెంటీ స్కీమ్ 5.0 కింద రూ.1,280.43 కోట్ల రుణాలు పంపిణీ
- రాష్ట్రంలో 3,606 ఖాతాలకు ప్రయోజనం..
- ఒక్కో రుణగ్రహీతకు గరిష్టంగా రూ.100 కోట్ల వరకు అదనపు రుణం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** పశ్చిమ ఆసియా (మిడిల్ ఈస్ట్) దేశాల్లో కొనసాగుతున్న సంక్షోభం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యాపార సంస్థలకు ఊరట కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారెంటీ స్కీమ్ 5.0 కింద ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు రూ. 1,280.43 కోట్ల అదనపు రుణాలు పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 3,606 రుణ ఖాతాలు ప్రయోజనం పొందాయి.

ఈ పథకం కింద బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు మంజూరు చేసే అదనపు రుణాలకు కేంద్ర ప్రభుత్వం గ్యారెంటీ కల్పిస్తోంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు 100 శాతం, ఇతర సంస్థలకు 90 శాతం వరకు రుణ భరోసా అందిస్తోంది.

మిగతా 2లో...

## అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** 18 సంవత్సరాలు పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగస్వాములు కావాలని తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని 7, 8 వార్డుల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా పరిశీలన (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఓటరు జాబితాలను ఖచ్చితంగా, తాజాగా ఉంచే లక్ష్యంతో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రతి అర్హత కలిగిన పౌరుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు పూర్తి చేసిన వారి పేర్లను కొత్తగా నమోదు చేయడం, మరణించిన ఓటర్ల పేర్లను తొలగించడం, ఒక

మిగతా 2లో...

## లెక్క పక్కా... సేవలు మెరుగ్గా!

- ఆసుపత్రుల్లో జవాబుదారీతనమే లక్ష్యం
- పనితీరు మదింపు విధానంలో మార్పులు..
- శానిటేషన్‌పై రాజీ లేదు..
- ప్రజల సంతృప్తిని 85 శాతానికి పెంచాలని మంత్రి సత్యకుమార్ యాదవ్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వాసుపత్రుల పనితీరును మరింత మెరుగుపరచి వీటి పట్ల ప్రజల్లో సంతృప్త స్థాయిని 85 శాతానికి పెంచాలని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారంనాడు ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ లక్ష్య సాధనకు సహకరించే 8 ప్రధానాంశాలపై దాదాపు 3 గంటల పాటు సంబంధిత అధికారులందరితో మంత్రి వర్చువల్‌గా సమీక్షించారు.

**జవాబుదారీతనం-పక్కా లెక్కలు కావాలి :** ప్రజల ఆశల మేరకు వైద్య సేవల్ని అందించేందుకు ప్రభుత్వ వైద్య సిబ్బంది జవాబుదారీతనాన్ని మరింతగా పెంచాలని... ఇందుకోసం ప్రభుత్వాసుపత్రుల పనితీరు మదింపు ప్రక్రియను సమగ్రంగా మార్చాలని మంత్రి ఉన్నతాధికారులను ఆదేశించారు. గత రెండేళ్లుగా...చిన్నాపెద్దా కలిపి 12,800 ఆసుపత్రుల్లో సాలీనా అందించబడుతున్న ఓపీ మరియుఐపీ సేవలు, నిర్వహించబడిన శస్త్ర చికిత్సలు, రోగులపై నిర్వహించిన డయాగ్నోస్టిక్ పరీక్షల ఆధారంగా

మిగతా 2లో...

## మామిడి రైతులకు కూటమి అండ

- తోతాపురికి కిలోకు రూ.4 సబ్సిడీ
- మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** తోతాపురి మామిడి రైతులను గత ఐదేళ్లలో పూర్తిగా నిర్లక్ష్యం చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పుడు రైతులపై ప్రేమ ఉన్నట్లు రాజకీయ డ్రామాలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు.

## స్టీల్ ప్లాంట్ పనులకు శ్రీకారం

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులకు ముహూర్తం ఖరారైంది. జులై 3న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారికంగా నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు నంద్యాల ఎంపీ శబరి తెలిపారు.



2

## ఏపీకి రెండు ఆడ పులులు

- మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌తో పవన్ భేటీ..
- తూర్పు కనుమల్లో పులుల సంరక్షణపై చర్చ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ గారిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. మంగళవారం ముంబైలోని మహారాష్ట్ర ముఖ్యమంత్రి వారి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో తూర్పు కనుమల్లో పులుల సంరక్షణ, మహారాష్ట్ర నుంచి రాష్ట్రానికి రెండు ఆడ పులులు ఇచ్చే అంశాలపై ఇరువురు నేతల మధ్య ఫలవంతమైన చర్చలు సాగాయి. ఉమ్మడి ప్రయోజనాలకు సంబంధించి భవిష్యత్తులో మరింత సహకరించుకోవాలని నిర్ణయించారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ఆంధ్ర ప్రదేశ్‌లోని తూర్పు కనుమల ప్రాంతంలో ఆడ పులుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో జన్యుపరమైన సమస్యలు తలెత్తాయి. ఈ క్రమంలో పులుల సంఖ్య పునరుద్ధరణకు మహారాష్ట్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటున్నాం. ఆంధ్రప్రదేశ్ కు రెండు ఆడ పులులు ఇచ్చేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. వారు అందిస్తున్న సహకారానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. తూర్పు కనుమలలో పులుల సంరక్షణ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుంది. తూర్పు కనుమల్లో ఆడ పులుల ప్రవేశంతో అంతరసంతానోత్పత్తి సమస్యలను అధిగమించడంతోపాటు, జన్యు వైవిధ్యం పెరిగి, పులుల సంఖ్య దీర్ఘకాలిక స్థిరత్వానికి దోహదపడుతుంది. తద్వారా తూర్పు కనుమలలో ఆరోగ్యకరమైన, స్వయం సమృద్ధి కలిగిన పులుల ఆవాస వ్యవస్థ ఏర్పడుతుంది.

మిగతా 2లో...

## వ్యవహార జ్ఞానమే విజయానికి బాట

**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** విశాఖలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పర్యటించారు. తొలుత విశాఖలోని ఐఎన్ఎస్ డేగాకు చేరుకున్న రాష్ట్రపతికి గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రులు లోకేశ్, అనిత, స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన నోవాటెల్‌కు రాష్ట్రపతి ముర్ము చేరుకున్నారు.

మిగతా 2లో...



## 'నాయకుల కార్ఖానా' జనసేన

- ప్రజాస్వామ్య పద్ధతిలో పార్టీ పదవుల ఎంపిక..
- కార్యకర్తలకు మంత్రి కందుల దుర్గేష్ పిలుపు


**జగ్గయ్యపేట (జర్నలిస్ట్ ఫైల్) :** జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా, పార్టీని సంస్థగతంగా క్షేత్రస్థాయి నుండి బలోపేతం చేసి నూతన నాయకత్వాన్ని పెంపొందిస్తామని రాష్ట్ర మంత్రి, ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ పరిశీలకులు కందుల దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం జగ్గయ్యపేటలోని

మిగతా 2లో...



## ప్రజల జీవితాల్లో మార్పే లక్ష్యం

- పరిపాలనా సంస్కరణలు వేగవంతం చేయాలి..
- శాఖల సమన్వయంతో పని చేయాలని కేంద్ర కార్యదర్శులకు ప్రధాని మోదీ దిశానిర్దేశం



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, ఆయా శాఖల కార్యదర్శులతో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం రోజు సేవా తీర్థ్‌లో కీలక సమావేశం నిర్వహించారు. దేశంలో పరిపాలనా సంస్కరణల్ని వేగవంతం చేయడం, వ్యాపారాలకు అనుకూల వాతావరణాన్ని మరింత మెరుగు పర్చడం, ప్రజలకు ప్రభుత్వ సేవల్ని సులభతరం చేయడం వంటి అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. అలాగే ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాల్ని ముందుకు తీసుకెళ్లడం, వేగంగా అమలు చేయడం కూడా ఈ 4 గంటల ఉన్నత స్థాయి సమావేశంలో చర్చకు వచ్చింది. సమావేశంలో ప్రధానంగా రెండు అంశాలపై సమీక్ష నిర్వహించారు. మొదటిది 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఈజ్ ఆఫ్ లివింగ్ కోసం డీ-రెగ్యులేషన్ (అనవసర నిబంధనల సరళీకరణ), ఇతర పరిపాలనా సంస్కరణలు' అంటే అంటే వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేయడం సహా పౌరుల రోజువారీ జీవన ప్రమాణాల్ని మెరుగుపర్చడం. ఇక రెండోది 'ఆత్మనిర్భర్ భారత్‌ను బలోపేతం చేయడం'. వివిధ రంగాల్లో స్వయం సమృద్ధి సాధించడం ద్వారా విదేశీ ఉత్పత్తులపై ఆధారపడటాన్ని తగ్గించడం.

ఈ సందర్భంగా వివిధ మంత్రిత్వ శాఖల కార్యదర్శులు తమ శాఖలు చేపడుతున్న సంస్కరణలు, ప్రభుత్వ విధానాల అమలు, ప్రజలకు మెరుగైన సేవలు

మిగతా 2లో...

## ప్రజల జీవితాల్లో మార్పే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

అందించేందుకు తీసుకుంటున్న చర్యలను ప్రధానికి వివరించారు. ప్రధాని విజన్‌ను కార్యచరణగా మార్చేందుకు చేపడుతున్న కార్యక్రమాలు, వివిధ రంగాల్లో ఎదురవుతున్న సవాళ్లు, వాటి పరిష్కారానికి రూపొందించిన భవిష్యత్తు వ్యూహాల్ని కూడా వివరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ– ప్రభుత్వ శాఖలు విడివిడిగా కాకుండా పరస్పర సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. మొత్తం ప్రభుత్వ యంత్రాంగం ఒకే లక్ష్యంతో పనిచేసే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. శాఖల మధ్య ఉన్న అడ్డంకుల్ని తొలగించి, సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగితే ప్రభుత్వ పనితీరు మరింత సమర్థవంతంగా ఉంటుందన్నారు ప్రధాని.

వివిధ శాఖల మధ్య సమన్వయం, సమాచార మార్పిడి, డేటా ఆధారిత నిర్ణయాల కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పీఎం గతిశక్తి ప్లాట్‌ఫారంను మరింత విస్తృతంగా వినియోగించాలని ప్రధాని సూచించారు. ఈ వేదిక ద్వారా మౌలిక సదుపాయాల ప్రణాళిక, ప్రాజెక్టుల సమన్వయం, వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవడం మరింత సులభతరమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల విజయాన్ని కేవలం అవి అమలవుతున్నాయా లేదా అన్నదానితో కాకుండా వాటి వల్ల ప్రజల జీవితాల్లో ఎంత మార్పు వచ్చిందనే దానితోనే అంచనా వేయాలని ప్రధాని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో కేబినెట్ సెక్రటరీ టీవీ సోమనాథన్, ప్రధాన మంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ పీకే మిశ్రా, ప్రిన్సిపల్ సెక్రటరీ, ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ తదితరులు పాల్గొన్నారు. ఇది 2026–27 ఆర్థిక సంవత్సరంలో ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన మొట్టమొదటి పూర్తి స్థాయి కార్యదర్శుల స్థాయి సమావేశంగా తెలుస్తోంది. 2026 రెండో అర్ధభాగానికి సంబంధించి ప్రభుత్వ విధానపర నిర్ణయాలు, ప్రాధాన్యతలకు అనుగుణంగా అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసుకోవడం కూడా సమావేశం ఉద్దేశంగా తెలుస్తోంది.

**మోదీ విజన్ లక్ష్యాలకు అనుగుణంగా- దీర్ఘకాలిక సంస్కరణలపై దృష్టి :** ఇక తాజా సమావేశంలో జరిగిన చర్చలు జూన్ 21న జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించిన సంస్కరణల కార్యచరణకు కొనసాగింపుగా నిలిచాయి. అప్పుడు కూడా ఈజ్ ఆఫ్ లివింగ్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మరింత మెరుగుపర్చడంతో పాటుగా యువతకు ఎక్కువ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మోదీ చెప్పారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యే నాటికి (2047, ఆగస్ట్ 15) అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను నిలబెట్టాలన్న మోదీ దార్శనికతలో భాగంగా ప్రభుత్వం దీర్ఘకాలిక సంస్కరణలపై దృష్టిసారిస్తున్న తరుణంలో ఈ మీటింగ్ జరిగింది. మరోవైపు పశ్చిమాసియా ఉద్రిక్తతలు, చమురు మార్కెట్లలో అస్థిరత వంటి ప్రతికూలతలు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ బలమైన పనితీరును కనబరుస్తున్న నేపథ్యంలో ఈ సమావేశం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఏపీకి రెండు ఆడ పులులు

(మొదటి పేజీ తరువాయి)

శాస్త్రీయ విధానాలు, స్థిరమైన వన్యప్రాణి నిర్వహణ ఆధారంగా జీవ వైవిధ్య పరిరక్షణకు ఇరు రాష్ట్రాలు కట్టుబడి ఉన్నాయన్న అంశాన్ని ఈ సంయుక్త సంరక్షణ కార్యచరణ ప్రతిబింబిస్తోంది. ఆంధ్రప్రదేశ్–మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య ఏర్పడిన ఈ భాగస్వామ్యం తూర్పు కనుమలలో పులుల దీర్ఘకాలిక సంరక్షణకు విశేషంగా దోహదపడుతుందని విశ్వసిస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో మాకు నిరంతరం మార్గదర్శకత్వం అందిస్తున్న కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కి కూడా ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. వన్యప్రాణి సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ లక్ష్యాల సాధనలో మహారాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, ఇతర భాగస్వామ్య సంస్థలతో కలిసి మరింత సమన్వయంతో ముందుకు వెళ్తామ"న్నారు.

## పరిశ్రమలకు ఆర్థిక ఊరట

(మొదటి పేజీ తరువాయి)

'స్టాండర్డ్' లోన్ ఖాతాలు కలిగిన సంస్థలు ఈ పథకానికి అర్హులు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో నాలుగో త్రైమాసికంలో వినియోగించిన వర్కింగ్ క్యాపిటల్ ఆధారంగా అదనంగా 20 శాతం వరకు రుణం పొందే అవకాశం ఉంది. అయితే ఒక్కో రుణగ్రహీతకు గరిష్టంగా రూ. 100 కోట్ల వరకు మాత్రమే అదనపు రుణం మంజూరు చేయనున్నారు.

ఈ పథకం కింద 2027 మార్చి 31లోపు రుణాలు మంజూరు కావాల్సి ఉండగా, 2027 జూన్ 30 నాటికి రుణ మొత్తాలు లబ్ధిదారులకు విడుదల చేయాల్సి ఉంటుంది. ఈ పథకం అమలును నేషనల్ క్రెడిట్ గ్యారెంటీ ట్రస్టీ కంపెనీ లిమిటెడ్ పర్యవేక్షిస్తోంది.

# పటిష్టంగా సమాచార నెట్‌వర్క్

కనెక్టివిటీ టూ లాస్ట్ మైల్ అనేదే లక్ష్యం
డిజిటల్ లిటరసికీ ఆపరేటర్ల సహకారం అవసరం
రాష్ట్రంలో కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** సమాచార నెట్వర్క్ అంశంలో ఆంధ్రప్రదేశ్ ను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో కమ్యూనికేషన్ నెట్వర్క్ ను ఏర్పాటు చేయటం ద్వారా సమాచార వ్యవస్థలో లాస్ట్ మైల్ కనెక్టివిటీ దిశగా పని చేస్తున్నామని సీఎం వెల్లడించారు. కమ్యూనికేషన్ నెట్ వర్క్‌ను మరింత బలోపేతం చేసేలా కృషి చేయాలని సూచించారు. క్యాంపు కార్యాలయంలో రాష్ట్రంలో కమ్యూనికేషన్ నెట్వర్క్ పై సీఎం వివిధ సర్వీసు ప్రొవైడర్లు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మొబైల్ కవరేజి విషయంలో సర్వీసు ప్రొవైడర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీఎం చెప్పారు. మారుమూల ప్రాంతాల్లో సెల్ టవర్లు, కమ్యూనికేషన్ నెట్వర్క్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏపీ వ్యాప్తంగా కమ్యూనికేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా మరిన్ని సెల్ టవర్లను ఏర్పాటు చేయాలని వివిధ కంపెనీల ప్రతినిధులకు సూచనలు జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 30,694 సెల్ టవర్లు ఉన్నాయని.. మరో 2310 సెల్ టవర్లను ఏర్పాటు చేయాల్సి ఉందని ఐటీ, కమ్యూనికేషన్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం అవసరమైన మేరకు సర్వీసు ప్రొవైడర్‌లకు ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తామని తెలిపారు. వంద రోజుల్లో సెల్ టవర్లను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. భౌగోళికంగా కవరేజి లేని ప్రాంతాల వివరాలను ఇస్తామని స్పష్టం చేశారు. రాజధాని అమరావతిలో ఫైబర్ ద్వారా సమాచార నెట్వర్క్ ను ఏర్పాటు చేస్తున్నామని ఎక్కడా తవ్వకాలు జరక్కుండా ప్రతీ ఇంటికీ ఫైబర్ నెట్వర్క్ అందిస్తామన్నారు. ఏపీ వ్యాప్తంగా 1,69,638 కిలోమీటర్ల ఫైబర్ ఆప్టిక్ నెట్వర్క్ తో పాటు 28.67 లక్షల బ్రాడ్ బ్యాండ్ కనెక్షన్లు ఉన్నాయని అధికారులు తెలిపారు.

**డిజిటల్ లిటరసీకి సహకారం :** రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ వినియోగదారుల్లో డిజిటల్ లిటరసీకి కూడా సర్వీసు ప్రొవైడర్లు సహకారం అందించాలని ముఖ్యమంత్రి కోరారు. ప్రభుత్వం వాట్సప్ గవర్నెన్సు మనమిత్ర ద్వారా అందిస్తున్న వివిధ సేవలు, సంజీవని పథకం సహా వివిధ టచ్ పాయింట్ ల సేవల్ని సమర్థంగా వినియోగించుకునేలా ఈ డిజిటల్ లిటరసీ ఉపకరిస్తుందన్నారు. ప్రజలను డిజిటల్ లిటరేట్లుగా మారిస్తే మొబైల్ ఫోన్ ద్వారా ఎక్కువ సేవలు అందించేందుకు అస్కారం ఉంటుందన్నారు. త్వరలో ఏఐ ఆగ్రానమిస్ట్, ఏఐ డాక్టర్, ఏఐ ట్యూటర్ లాంటి వేర్వేరు సేవల్ని వినియోగదారులు ఉపయోగించుకునేందుకు అవకాశం ఉందని వివరించారు. కుప్పం నియోజకవర్గంలో పైలట్ ప్రాతిపదికన అన్ని ప్రాంతాలకూ పూర్తి మొబైల్ కవరేజి అందిస్తున్నట్టు తెలిపారు. ఈ సమీక్షకు ఐటీ, కమ్యూనికేషన్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, డిపార్ట్ మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ , బీఎస్ఎన్ఎల్, ఎయిర్ టెల్, జియో, వోడా ఫోన్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

## 'నాయకుల కార్ఖానా' జనసేన

(మొదటి పేజీ తరువాయి)

జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న జనసైనికులు, వీర మహిళలు, నాయకులకు వారి అర్హతలను బట్టి వివిధ విభాగాల్లో పదవులు కల్పించేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే విజయవాడలో ప్రారంభమైన ఈ ప్రక్రియకు అభ్యర్థుల నుండి విశేష స్పందన లభించిందని, ఈ కార్యక్రమంపై క్యాడర్‌లో విస్తృత అవగాహన కల్పించేందుకు జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నామని చెప్పారు. సాధారణ రాజకీయ పార్టీలకు భిన్నంగా, క్షేత్రస్థాయి నుంచే నిజమైన నాయకులను తయారు చేయాలన్నది జనసేనాని పవన్ కళ్యాణ్ లక్ష్యమని స్పష్టం చేశారు.

పార్టీ పదవుల కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు పార్టీ పట్ల అంకితభావం, నిరంతర కృషి, జనసేన సిద్ధాంతాలపై పూర్తి అవగాహన, సామాజిక సమస్యలపై స్పందించే బాధ్యతాయుత గుణం, రాజకీయ పరిజ్ఞానం ఉండాలని సంబంధిత అంశాలను పరిశీలనలోకి తీసుకుంటామన్నారు.

అభ్యర్థులు తమకున్న అర్హతలను బట్టి లోక్‌సభ, అసెంబ్లీ, జిల్లా, మండల, మరియు గ్రామ స్థాయి కమిటీలతో పాటు ఇతర అనుబంధ విభాగాలలో తమకు నచ్చిన పదవులను తామే స్వయంగా ఎంచుకునేలా అప్లికేషన్ ఫారమ్‌లను రూపకల్పన చేయడం విశేషమన్నారు. అభ్యర్థుల నుండి వచ్చిన దరఖాస్తులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత జనసేనాని పవన్ కళ్యాణ్ అంతిమ నిర్ణయం తీసుకుని సమర్థులను పదవులకు ఎంపిక చేస్తారని మంత్రి దుర్గేష్ వివరించారు. పూర్తి పారదర్శకంగా, ప్రజాస్వామ్యయుతంగా జరుగుతున్న ఈ అద్భుతమైన ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. "నాయకులను తయారు చేసే కార్ఖానా 'జనసేన' అని, మన పార్టీని మనమే నిర్మించుకుందాం.. అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రజలకు సేవ చేసే ఉత్తమ నాయకులుగా ఎదుగుదాం" అని మంత్రి కందుల దుర్గేష్ ఈ సందర్భంగా కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి మంత్రి దుర్గేష్ ధన్యవాదాలు తెలిపారు.

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భుజం గాయంతో గత కొంత కాలంగా తీవ్రంగా బాధపడుతున్నప్పటికీ, ముందుగా నిర్ణయించిన ప్రభుత్వ కార్యక్రమాలు, అధికారిక బాధ్యతలను పూర్తి చేసిన తర్వాతే సర్జరీ చేయించుకోవాలని నిర్ణయించుకున్నారని మంత్రి కందుల దుర్గేష్ భావోద్వేగంతో తెలిపారు. ప్రజల సంక్షేమం పట్ల ఆయనకున్న నిబద్ధతకు, తపనకు ఈ సందర్భమే నిదర్శనమని పేర్కొంటూ... ప్రస్తుతం జనసేనాని పవన్ కళ్యాణ్ ముంబైలో చికిత్స పొందుతున్నారని మంత్రి వెల్లడించారు.

## ఖనిజాలకు 'వ్యాల్యూ' పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

బీచ్ శాండ్, రేర్ ఎర్త్ మినరల్స్, ముడి ఇనుము, మాంగనీస్, అల్యూమినా లాంటి వివిధ ఖనిజాలకు విలువ జోడింపు ప్రక్రియ ద్వారా గరిష్టంగా రెవెన్యూను ఆర్జించేందుకు ఆస్కారం ఉందని సీఎం అన్నారు. దేశంలోని కొన్ని రాష్ట్రాలు ఖనిజ ఆదాయం కారణంగానే రెవెన్యూ మిగులు సాధించాయని సీఎం వ్యాఖ్యానించారు. ఖనిజాల వ్యాల్యూ అడిషన్ కు సంబంధించి విస్తృతంగా చర్చించి ఓ ప్రత్యేక విధానం తీసుకువచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు. రాష్ట్రంలోనే ఈ ఖనిజాల విలువ జోడింపు ప్రక్రియ జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఏపీ, ఒడిశా, కేరళ లాంటి రాష్ట్రాల్లో లభ్యమయ్యే అత్యంత విలువైన రేర్ ఎర్త్ మినరల్స్‌పై క్లస్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు. టైటానియం, ఇలమనైట్, మోనజైట్ లాంటి హై వాల్యూ మినరల్స్ నిల్వలు ఏమేరకు ఉన్నాయన్న దానిని గుర్తించాలన్నారు.

ఎలక్ట్రానిక్స్, మాగ్నెట్స్ సహా విలువైన లోహాలను తయారు చేసేందుకు రేర్ ఎర్త్ మినరల్స్ వెలికితీత జరగాలన్నారు. ప్రత్యేకమైన పరికరాల తయారీకి కీలకమైన ఈ లోహాలు అణు ఇంధనం సహా వ్యూహాత్మకంగా దేశానికి కూడా అత్యంత కీలకమని సీఎం అన్నారు. రాష్ట్రంలో జొన్నగిరి సహా చిత్తూరు జిల్లా చిగురుగుంట వద్ద కూడా బంగారం నిల్వలు ఉన్నాయని మిగతా బ్లాక్స్ పై కూడా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి గనుల శాఖకు సూచనలిచ్చారు.

రాష్ట్రంలోని 126 ప్రాంతాల్లో క్రిటికల్, బల్క్ ఖనిజాలు సహా ఇతర విలువైన ఖనిజాలను గుర్తించామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం మైనింగ్ ఆపరేషన్స్ ద్వారా రెవెన్యూలో 18 శాతం మేర వృద్ధి నమోదైనట్టు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం గనుల తవ్వకాలను కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు. ఖనిజ సంపద ద్వారా రాష్ట్రానికి గరిష్ట ఆదాయం వచ్చేలా చూడాలని సూచించారు. ఇసుక తవ్వకాల, సరఫరా పై కూడా పూర్తి స్థాయి నిఘా ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇసుక రీచ్ ల వద్ద సీసీ కెమెరాలతో పాటు శాటిలైట్ చిత్రాల ద్వారా విశ్లేషించటంతో పాటు వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల కోసమే ఇసుకపై వెయ్యి కోట్ల రూపాయల మేర ఆదాయాన్ని వదిలేసి ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని అన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ సమీక్షలో గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, సీఎస్ సాయి ప్రసాద్, గనుల శాఖ, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శులు ముఖేష్ కుమార్ మీనా, పీయుష్ కుమార్ సహా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జీవితాల్లో మార్పే అసలైన విద్య

(మొదటి పేజీ తరువాయి)

**అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే వికసిత్ భారత్ కల సాకారం :** అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే, అన్ని వర్గాలు భాగస్వామ్యం అయితేనే వికసిత్ భారత్ కల సాకారమవుతుంది. గిరిజన ప్రాంతాల్లోని విశ్వవిద్యాలయాలు కేవలం విద్యా కేంద్రాలు మాత్రమే కావు... అవి సామాజిక పరివర్తనకు, సమాన అవకాశాలకు మార్గదర్శకాలు. ఒక కుటుంబంలో తొలి తరం విద్యార్థి పట్టభద్రుడైతే... ఆ కుటుంబం మొత్తం ముందుకు సాగుతుంది. దీంతో పాటు దేశం కూడా అభివృద్ధి చెందుతుంది. పరిశోధన, ఆవిష్కరణలు, అభివృద్ధి ద్వారా ప్రతి పౌరుడికి సాధికారత కల్పిస్తూ.. మన గొప్ప గిరిజన వారసత్వాన్ని కాపాడుకోవడమే వికసిత్ భారత్ స్ఫూర్తి.

**రాష్ట్రపతి కంటే ముఖ్య అతిథి మరొకరు ఉండరు :** ఈ రోజు మీరు మీ డిగ్రీలను అందుకుంటున్న ఈ వేళ.. మీ ముందున్న ముఖ్య అతిథిని ఒక్కసారి చూడాలని నేను కోరుతున్నా. గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవానికి మన రాష్ట్రపతి గారి కంటే మరింత అర్థవంతమైన ముఖ్య అతిథి మరెవరూ ఉండరు. ఆమె జీవితం స్వయంగా ఈ విశ్వవిద్యాలయం వంటి విద్యాసంస్థలు ఎందుకు అవసరమో చెప్పే అత్యుత్తమ సమాధానం. రాష్ట్రపతి గారు ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లాలో ఉన్న ఉపర్‌బేడా అనే చిన్న గిరిజన గ్రామంలో జన్మించారు. ఆ రోజుల్లో పాఠశాలకు చేరుకోవాలంటే ఎంతో దూరం నడిచి వెళ్లాల్సి వచ్చేది. గిరిజన బాలికలు ఉన్నత విద్యను అభ్యసించడం చాలా అరుదు. అయినప్పటికీ ఆమె తన గ్రామం నుంచి డిగ్రీ పూర్తి చేసిన తొలి మహిళగా నిలిచారు. ఆమె వేసిన ఆ ఒక్క అడుగు ఆమె భవిష్యత్తునే కాదు.. ఆమె తర్వాత వచ్చిన వేలాది గిరిజన బాలికల ఆశయాలను కూడా మార్చింది.

**స్వయంకృషితో రాష్ట్రపతిగా ఎదిగిన వ్యక్తి ద్రౌపది ముర్ము :** ప్రజా జీవితంలోకి ప్రవేశించే ముందు.. ఆమె రాయరంగ్‌పూర్‌లోని శ్రీ అరవిందో ఇంటిగ్రల్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో ఉపాధ్యాయురాలిగా సేవలందించారు. ఉపాధ్యాయ వృత్తి తనకు అత్యంత సంతృప్తిని ఇచ్చిందని, ప్రజా విధానాలను రూపొందించే ముందు విద్యార్థుల జీవితాలను మలిచే అవకాశం తనకు దక్కిందని ఆమె తరచూ చెబుతుంటారు. నాయకత్వం అనేది సేవతోనే ప్రారంభమవుతుందని ఇది మనకు గుర్తుచేస్తుంది. ఆమె ప్రజా జీవితం వారసత్వ ఆధారంగా వచ్చింది కాదు. రాయరంగ్‌పూర్ నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్‌లో కౌన్సిలర్‌గా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం వైస్ ఛైర్‌పర్సన్‌గా, ఎమ్మెల్యేగా, ఒడిశా రాష్ట్ర మంత్రిగా, జార్ఖండ్ గవర్నర్‌గా, చివరకు భారత రాష్ట్రపతిగా ఎదిగారు. ప్రజాసేవ ద్వారా ఒక్కో మెట్టు ఎక్కుతూ స్వయంకృషితో సాధించారు.

**సంకల్ప బలంతో ప్రజాసేవలోకి తిరిగొచ్చారు :** అయితే రాష్ట్రపతి ప్రయాణాన్ని అసాధారణంగా నిలబెట్టింది ఆమె అధిరోహించిన పదవులు మాత్రమే కాదు.. ఆమె జీవితంలో ఎదుర్కొన్న వ్యక్తిగత విషాదాలు కూడా. 2009 నుంచి 2014 మధ్య ఆమె తన పెద్ద కుమారుడు, చిన్న కుమారుడు, భర్త, తల్లి, సోదరుడిని కోల్పోయారు. అలాంటి దుఃఖాన్ని ఊహించడం కూడా మనలో చాలామందికి సాధ్యం కాదు. అయినప్పటికీ ఆమె నిరాశకు గురికాలేదు. ఆధ్యాత్మికతలో బలాన్ని వెతుక్కొని.. కొత్త సంకల్పంతో తిరిగి ప్రజాసేవలోకి వచ్చారు. తన వ్యక్తిగత బాధను సమాజం పట్ల కరుణగా, సేవా సంకల్పంగా మలిచారు. 2022లో భారత




రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం సందర్భంగా.. భారతదేశంలోని పేదలు కలలు కనడమే కాదు, ఆ కలలను నిజం చేసుకోగలరనే విషయానికి నా ఎన్నికే నిదర్శనం అని చెప్పారు. అవి కేవలం ప్రమాణ స్వీకార సభలో పలికిన మాటలు కావు. ఎన్నో ప్రతికూల పరిస్థితులను అధిగమిస్తూ సాగిన ఆమె జీవితానికి నిదర్శనంగా నిలిచాయి. నేడు ఒక గిరిజన చిన్నారి రాష్ట్రపతి భవన్‌ను చూసినప్పుడు.. అది ఇకపై తనకు దూరంగా ఉన్న ఒక అధికార సంస్థగా కనిపించదు. గ్రామీణ పాఠశాలలో చదివిన, ఉపాధ్యాయురాలిగా పనిచేసిన, గ్రామీణ మార్గాల్లో ప్రయాణించిన, జీవితంలో వ్యక్తిగత కష్టాలను ఎదుర్కొన్నప్పటికీ విద్య, ప్రజాస్వామ్యం, ప్రజాసేవలపై విశ్వాసాన్ని ఎన్నడూ కోల్పోని వ్యక్తి అక్కడ ఉన్నారనే స్ఫూర్తి కనిపిస్తుంది.

**ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే అసలైన విద్య :** ఈ రోజు మీరు ఒక డిగ్రీని అందుకుంటున్నారు. కానీ రేపు జీవితం మిమ్మల్ని ఒక పెద్ద ప్రశ్న అడుగుతుంది. మీ వల్ల సమాజానికి ఎలాంటి మార్పు వచ్చిందని అడుగుతుంది. విద్య అసలు ఉద్దేశం కేవలం డిగ్రీ సంపాదించడం మాత్రమే కాదు... ప్రజల జీవితాలను మార్చే పరిష్కారాలను చూపడమే అసలైన విద్య. ప్రస్తుతం మనం ఏఐ యుగంలో జీవిస్తున్నాం. ఏఐ సమాధానాలను ఇవ్వగలదు. కానీ మానవీయ విలువలు, జిజ్ఞాస, కరుణ, వ్యక్తిత్వాన్ని ఎన్నటికీ భర్తీ చేయలేదు. ఈ విలువలు గొప్ప విశ్వవిద్యాలయాల్లోనే పెంపొందుతాయి. అవే గొప్ప వ్యక్తులను తీర్చిదిద్దుతాయి. అందుకే విశ్వవిద్యాలయాలు కేవలం నైపుణ్యం కలిగిన వృత్తి నిపుణులను మాత్రమే కాదు.. బాధ్యతాయుతమైన పౌరులను, మానవతా దృక్పథం కలిగిన నాయకులను, జీవితాంతం నేర్చుకునే వ్యక్తులను తయారు చేయాలి.

**విద్యార్థులను భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దుతాం :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు కలలుగన్న వికసిత్ భారత్ లో నాణ్యమైన విద్య, ఆవిష్కరణలు, పరిశోధనలు అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి కేంద్ర బిందువులుగా నిలుస్తాయి. ఉన్నత విద్యను మరింత బలోపేతం చేస్తూ.. భారత యువతకు మరిన్ని అవకాశాలను కల్పిస్తున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గారికి అభినందనలు. ఈ జాతీయ దార్శనికత నుంచి స్ఫూర్తి పొందుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ఏపీ ఉన్నత విద్యలో సమూల మార్పులు తీసుకువస్తున్నాం. జ్ఞానాన్ని సృష్టించే, ఆవిష్కరణలకు ప్రేరణనిచ్చే విద్యార్థులను కేవలం ఉద్యోగాలకే కాకుండా నాయకత్వానికి సిద్ధం చేసే విశ్వవిద్యాలయాలను నిర్మిస్తున్నాం. మా లక్ష్యం కేవలం డిగ్రీలు అందుకున్న విద్యార్థులను తయారు చేయడం కాదు... భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దడం. నాణ్యమైన అధ్యాపక బృందం, పరిశ్రమల అవసరాలకు అనుసంధానమైన నైపుణ్యాలు, పరిశోధన, ఆవిష్కరణల ద్వారా వేగంగా మారుతున్న ప్రపంచంలో ప్రతి విద్యార్థి విజయవంతం అయ్యేలా భవిష్యత్ విశ్వవిద్యాలయాలను నిర్మిస్తున్నాం.

**యువతలో ఆత్మవిశ్వాసం నెలకొల్పడమే లక్ష్యం :** మా లక్ష్యం సులభంగా ఉన్నప్పటికీ ఎంతో ఉన్నతమైంది. ప్రతి విద్యార్థి ఉపాధికి అర్హుడు కావాలి, ప్రతి విశ్వవిద్యాలయం ఆవిష్కరణలకు కేంద్రంగా మారాలి, ప్రతి పరిశోధకుడు సాధికారత పొందాలనేది మా లక్ష్యం. ముఖ్యంగా ప్రపంచంలోని అత్యుత్తమ ప్రతిభతో పోటీ పడగలమనే ఆత్మవిశ్వాసం ప్రతి యువతలో ఉండాలని మేం కోరుకుంటున్నాం. ఈ రోజు మీ తల్లిదండ్రులు మీ డిగ్రీని గర్వంగా ఫ్రేమ్ చేయించుకుంటారు. కానీ మీ నిర్ణయాలు, మీ విలువలు, సమాజానికి మీరు చేసిన సేవలనే జీవితం గుర్తుంచుకుంటుంది. మీ వల్ల ఎన్ని జీవితాలు మారాయి, ఎన్ని సమస్యలకు పరిష్కారాలు చూపించారు, ఎంతమందికి అవకాశాలు కల్పించారనేదే మీ విజయానికి ప్రామాణికం కావాలి.

**వ్యక్తిత్వాన్ని కాపాడుకోవాలి :** ఇతరుల జీవితాలను మార్చగల శక్తిని మనకు ఇచ్చినప్పుడే విద్య పరమార్థం నెరవేరుతుంది. ఈ రోజు మీరు ఈ విశ్వవిద్యాలయం నుంచి బయటకు అడుగుపెడుతున్నప్పుడు... మీ జ్ఞానాన్ని ఆత్మవిశ్వాసంతో, మీ మూలాలను గర్వంతో, మీ విలువలను వినయంతో మీతో పాటు తీసుకెళ్లండి. డిగ్రీ మీకు ఒక వృత్తిని అందించవచ్చు... కానీ మీ వ్యక్తిత్వమే మీకు గౌరవాన్ని సంపాదించి పెడుతుంది. సమాజానికి మీరు చేసే సేవే మీకు చిరస్థాయిగా నిలిచిపోయే వారసత్వాన్ని అందిస్తుంది. మీ ప్రయాణం మరెందరో జీవితాలకు స్ఫూర్తిగా నిలవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని మంత్రి పేర్కొన్నారు.

అంతకుముందు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా బంగారు పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ మదన్ లాల్ మీనా, వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ టీ. శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి



(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారిన వారి వివరాలను సవరించడం, ఓటరు జాబితాలోని తప్పులను సరిదిద్దడం, నకిలీ నమోదులను తొలగించడం వంటి అంశాలకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు.

కొత్త ఓటరుగా నమోదు కావడంతో పాటు పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాలను సవరించుకోవచ్చని, మరో నియోజకవర్గానికి మారిన వారు ఓటరు నమోదును బదిలీ చేసుకోవచ్చని చెప్పారు. అవసరమైతే పేరును తొలగించుకునే అవకాశమూ ఉందన్నారు. ఇందుకోసం ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం లేదా వయస్సు రుజువు, నివాస ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, విద్యుత్ బిల్లు వంటి పత్రాలు అవసరమవుతాయని వివరించారు.

ప్రత్యేక సవరణ కార్యక్రమంలో ప్రచురించే ముసాయిదా ఓటరు జాబితాపై ప్రజలు అభ్యంతరాలు లేదా సవరణల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, వాటిని పరిశీలించిన అనంతరం తుది ఓటరు జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేస్తుందని ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి ప్రతినిధులు పాల్గొన్నారు.

## వ్యవహార జ్ఞానమే విజయానికి బాట

(మొదటి పేజీ తరువాయి)

అక్కడ ఏర్పాటు చేసిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవంలో ఆమె పాల్గొన్నారు.

ఈ సందర్భంగా 373 మంది డిగ్రీ, పీజీ విద్యార్థులకు పట్టాలు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 13 మంది విద్యార్థులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బంగారు పతకాలు ప్రదానం చేశారు. పతకాలు అందుకునేవారిలో 40 శాతం మహిళలు ఉండడం గొప్ప విషయమని ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. స్వర్ణ పతకం సాధించిన వారిలో 70 శాతం మహిళలు ఉండడం గర్వకారణమన్నారు. గిరిజన వర్సిటీ విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెంపొందించే కేంద్రంగా నిలుస్తోందని చెప్పారు.

తొలి స్నాతకోత్సవం గిరిజన వర్సిటీకి కీలక మైలురాయని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. గిరిజన విద్యార్థుల దీర్ఘకాల కలలను విశ్వవిద్యాలయం సాకారం చేస్తోందన్నారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ విద్యార్థులకు మంచి విద్య అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో 27.39 లక్షల మంది గిరిజన విద్యార్థులు ఉన్నారని చెప్పారు. గిరిజనులు సాగు చేస్తున్న అ–రకు కాఫీకి మంచి పేరు వచ్చిందని గవర్నర్ గుర్తుచేశారు.

గిరిజన వర్సిటీ భవనం శంకుస్థాపన చేసే అవకాశం వచ్చింది. ఈ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి రావడం గర్వకారణం. ఈ విషయం విద్యార్థులకు జీవితకాలం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకం. విద్యార్థులు మరింత బాధ్యతాయుతమైన స్థానానికి రాబోతున్నారు. విద్యార్థుల బాధ్యతాయుతమైన స్థానంతో లక్షలాది మందికి హక్కుల పరిరక్షణ. వందేళ్ల క్రితం భారత్ పరిస్థితి ఎలా ఉంది? ఇప్పుడు ఎలా ఉంది? ఆలోచించాలని" కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు.

## మామిడి రైతులకు కూటమి అండ

(మొదటి పేజీ తరువాయి)

గతంలో మామిడి ధరలు కిలో రూ. 2కు పడిపోయినా రైతులకు ఎలాంటి సాయం చేయని వారు, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. గత ఏడాది ప్రభుత్వం కిలోకు రూ. 4 చొప్పున జోక్యం చేసుకుని రైతులకు రూ. 190 కోట్ల ఆర్థిక సహాయం అందించిందని, ఈ ఏడాది కూడా అదే స్థాయిలో సబ్సిడీ కొనసాగిస్తూ రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో కేంద్రం నుంచి రూ. 281 కోట్ల ఆర్థిక సహాయం సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పల్ప్ ఫ్యాక్టరీల సిండికేట్ ద్వారా రైతులను తక్కువ ధరలకు మామిడి కొనుగోలు చేసి దోపిడీ చేసిన వారే ఇప్పుడు రైతు పక్షపాతులమంటూ లేఖలు రాయడం రాజకీయ కపట నాటకమని మంత్రి విమర్శించారు. నిజంగా రైతులపై చిత్తశుద్ధి ఉంటే ముందుగా పల్ప్ ఫ్యాక్టరీల సిండికేట్‌ను అరికట్టాలని సూచించారు. గత ప్రభుత్వంలో ఉద్యాన పంటల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పండ్ల సంరక్షణ కార్యక్రమాలకు తొలి ఏడాది రూ. 3.5 కోట్లు, రెండో ఏడాది రూ. 30 కోట్లు కేటాయించి ఉద్యాన రైతుల అభివృద్ధికి చర్యలు చేపట్టిందని చెప్పారు. రైతుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో ప్రస్తుతం 93,336 హెక్టార్లలో తోతాపురి సాగు జరగగా, 8.84 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా ఉందని మంత్రి వెల్లడించారు. ఇప్పటివరకు 4.42 లక్షల మెట్రిక్ టన్నుల కోత పూర్తికాగా, అందులో 2.57 లక్షల మెట్రిక్ టన్నులను పల్ప్ యూనిట్లు, 1.84 లక్షల మెట్రిక్ టన్నులను టేబుల్ వినియోగానికి విక్రయించినట్లు తెలిపారు. జూన్ 29 నాటికి పల్ప్ యూనిట్లు 2.57 లక్షల మెట్రిక్ టన్నుల మామిడిని కొనుగోలు చేశాయని, కర్ణాటకలో పరిమిత షరతులతోనే ధరల వ్యత్యాస సాయం అమలవుతుండగా, తమిళనాడులో ప్రత్యక్ష సబ్సిడీ లేదని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలకు భిన్నంగా కేంద్ర నిర్ణయానికి ముందే రాష్ట్రప్రభుత్వం కిలోకు రూ. 4 సబ్సిడీ ప్రకటించి మామిడి రైతులకు అండగా నిలిచిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

## స్టీల్ ప్లాంట్ పనులకు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)



కడప స్టీల్ ప్లాంట్ రాయలసీమ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్న ఆమె, మాటలకే పరిమితం కాకుండా చేతల్లో చూపించే ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ నిర్మాణంలో కనీసం కాంపౌండ్ వాల్ కూడా నిర్మించలేదని విమర్శించారు.

2018 డిసెంబర్ 27న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే కడప స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. రాయలసీమపై వెనుకబడిన ప్రాంతం అనే ముద్రను తొలగించి, 'రాయల్ సీమ'గా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆమె చెప్పారు. హార్టికల్చర్, ఎలక్ట్రానిక్స్, పరిశ్రమల హబ్‌గా రాయలసీమను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు కొబ్బరికాయలు కొట్టి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కడప స్టీల్ ప్లాంట్ కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాదని, వేలాది మంది యువతకు ఉపాధి, అనేక కుటుంబాలకు భవిష్యత్తుకు భరోసా కల్పించే ప్రాజెక్టు అని పేర్కొన్నారు.

విద్యుత్, నీటి సరఫరా, రహదారులు వంటి అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేసిన తర్వాతే నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు దాదాపు 800 కంపెనీలు పెట్టుబడులతో ముందుకొచ్చాయని పేర్కొంటూ, గత ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధికి ఏం చేసిందో సమాధానం చెప్పాలని ఎంపీ శబరి డిమాండ్ చేశారు.

# ఏపీఎల్ ఫైనల్ సందడి



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :మంగళగిరిలోని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం క్రికెట్ అభిమానుల కోలాహలంతో మారుమోగుతుంది. వేలాది మంది అభిమానుల కేరింతలు, ఉత్సాహభరిత వాతావరణం మధ్య నిర్వహించిన ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ఫైనల్ పోరు క్రీడా సంబరాలను తలపిస్తుంది. సింహాద్రి వైజాగ్ లయన్స్ మరియు భీమవరం బుల్స్ జట్ల మధ్య జరుగుతున్న ఫైనల్ మ్యాచ్‌కు రాష్ట్ర ఐటీ, మానవవనరులు, ఆర్టీజీఎస్ శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టాస్ వేసి తుది పోరును యువనేత లోకేష్ ప్రారంభించారు. టాస్ గెలిచిన సింహాద్రి వైజాగ్ లయన్స్ జట్టు ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. మ్యాచ్‌లో పాల్గొంటున్న ఇరు జట్ల ఆటగాళ్లకు మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, క్రీడాస్ఫూర్తితో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాలని ఆకాంక్షించారు.

దీనికి ముందు ఆంధ్రప్రదేశ్‌లో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి మరో మైలురాయిగా నిలిచేలా మంగళగిరిలోని-చాజూా క్రీడా ప్రాంగణంలో ఆధునీకరించిన అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం స్మారక ఫలకాన్ని మంత్రి నారా లోకేష్ ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు కేశినేని శివనాథ్(చిన్ని), ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు, ఉపాధ్యక్షులు బండారు నరసింహారావు, సంయుక్త కార్యదర్శి బోయల్ల విజయ్ కుమార్, కోశాధికారి దండమూడి శ్రీనివాస్, కౌన్సిలర్ విష్ణు దంతు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## గుంటూరు స్పైసెస్ పార్కు అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి



- స్పైసెస్ బోర్డు సమావేశంలో బోర్డు సభ్యుడు కొత్తూరు వెంకటసుబ్బారావు విజ్ఞప్తి

న్యూఢిల్లీ, (జర్నలిస్ట్ ఫైల్): కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని వాణిజ్య భవన్‌లో మంగళవారం నిర్వహించిన స్పైసెస్ బోర్డు సమావేశంలో గుంటూరు జిల్లాకు సంబంధించిన పలు కీలక అంశాలను బోర్డు సభ్యుడు కొత్తూరు వెంకటసుబ్బారావు ప్రస్తావించారు. ముఖ్యంగా గుంటూరు స్పైసెస్ పార్కు అభివృద్ధి, మిగిలిన ప్లాట్ల కేటాయింపును ప్రాధాన్యతా క్రమంలో త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఎగుమతిదారుల గత మూడేళ్ల పనితీరు, ఖాతాలను పరిశీలించి ప్లాట్ల కేటాయింపు చేపట్టాలని సూచించారు. అలాగే స్పైసెస్ పార్కులో రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, ఫెన్సింగ్, క్యాంటీన్ వంటి మౌలిక సదుపాయాలను వెంటనే అభివృద్ధి చేయాలని స్పైసెస్ బోర్డు చైర్‌పర్సన్ సంగీతా విశ్వనాథన్, కార్యదర్శి మనివణియం దృష్టికి తీసుకెళ్లారు.

చైనాకు గుంటూరు నుంచి ఎగుమతి చేసిన మూడు మిర్చి కంటైనర్లు తిరస్కరణకు గురైన అంశాన్ని కూడా సమావేశంలో ప్రస్తావించిన వెంకటసుబ్బారావు, సంబంధిత సంస్థల లైసెన్సులు రద్దు చేయడం వల్ల ఎగుమతి రంగంపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిణామాలు కొనసాగితే ఎగుమతిదారుల్లో విశ్వాసం దెబ్బతిని ఇతర వ్యాపారాల వైపు మళ్లే అవకాశం ఉందని, దాని ప్రభావం రైతులపై పడడంతో మిర్చికి గిట్టుబాటు ధరలు తగ్గి రైతుల ఆదాయం దెబ్బతింటుందని తెలిపారు. ఇది దేశ ఆర్థికాభివృద్ధిపైనా ప్రభావం చూపుతుందని పేర్కొంటూ సమస్య పరిష్కారానికి స్పైసెస్ బోర్డు జోక్యం చేసుకోవాలని కోరారు.

దీనిపై స్పందించిన స్పైసెస్ బోర్డు అధికారులు ఈ అంశంపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి వీలైనంత త్వరగా సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని, చైనా అధికారులతో చర్చలు జరిపి ఎగుమతులకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో స్పైసెస్ బోర్డు చైర్‌పర్సన్ సంగీతా విశ్వనాథన్, కార్యదర్శి మనివణియం, వైస్ చైర్మన్ షాజీ రాఘవన్ నాయక్, బోర్డు సభ్యుడు కొత్తూరు వెంకటసుబ్బారావుతో పాటు వివిధ కేంద్ర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వేలమంది విద్యార్థులకు మార్గదర్శి ఉపాధ్యాయురాలు శ్రీలక్ష్మి



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్ది వారికి బంగారు భవిష్యత్తును అందించిన ఉపాధ్యాయురాలు పట్టెం శ్రీలక్ష్మి అని ఎంఈఓ డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మండల గ్రామమైన కట్టెవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో మ్యాథ్స్ టీచర్గా పనిచేస్తూ ఉద్యోగవిరమణ చేస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో శ్రీలక్ష్మిని ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ ఆధ్వర్యంలో ఎంఈఓ తోటి ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయురాలు శ్రీలక్ష్మి గత 31 సంవత్సరాలుగా మాథ్స్ టీచరుగా పనిచేస్తూ వేల మంది విద్యార్థుల యొక్క భవిష్యత్తును తీర్చిదిద్దినట్లు ఆయన తెలియజేశారు. ఆమె యొక్క శేష జీవితం కుటుంబ సభ్యులతో సంతోషంగా అందరితో కలిసి జీవించాలని ఆయన కోరారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ మాట్లాడుతూ మ్యాథ్స్ టీచర్ శ్రీలక్ష్మి ఉద్యోగ విధులపట్ల అంకితభావంతో, క్రమశిక్షణతో తన విధులను కొనసాగించారని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి డి.రాధాకృష్ణమాచార్యులు, పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు జివిఎస్ రామకృష్ణ, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, రిటైర్డ్ హెచ్ఎం ఎం నాగేశ్వరావు, రిటైర్డ్ లెక్చరర్ పాల్ ప్రసాద్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు వివిఎంఎల్ శాస్త్రి, కుటుంబసభ్యులు శ్రీలక్ష్మిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మ్యాథ్స్ టీచర్ పి.శ్రీలక్ష్మి హైస్కూల్ ఆఫీస్ రూమ్ కు ఇనుప బీరువాను బహుకరించారు.

# లెక్క పక్కా... సేవలు మెరుగ్గా!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వాసుపత్రుల పనితీరును ప్రభుత్వం మదింపు చేసింది. దరిమిలా... సేవల సంఖ్యల్లో ఉన్నతి కనిపించినా, పనిచేసిన వారు, చేయని వారిని ఒకే గాటిన కట్టినట్లవుతోంది. దీనికి భిన్నంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ నూతన విధానాన్ని సూచించారు.



**పనితీరు మదింపునకు నూతన విధానం :** ప్రజారోగ్య వ్యవస్థలో పనిచేస్తున్న వైద్యులు, ఇతర సిబ్బందిని పరిగణలోకి తీసుకుని ప్రతి వైద్యుడు, నర్స్, టెక్నీషియన్ రోజుకి ఏ స్థాయిలో వివిధ సేవలు అందించాలో మదింపు చేసి, దాని ఆధారంగా ప్రతి ఆసుపత్రి, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లకు ఒక ఏడాదిలో అందించాల్సిన సేవల లక్ష్యాన్ని నిర్ధారించాలని మంత్రి ఆదేశించారు. వీటితో పోల్చి చూసి, ఆయా ఆసుపత్రులు గరిష్ట స్థాయిలో పనిచేశాయా లేదా అని మదింపు చేయాలని మంత్రి సూచించారు. ఇదే విధంగా ప్రతి డాక్టరు, ఇతర సిబ్బందికి సంబంధించి కూడా పక్కా లెక్కలు తేల్చాలని, తద్వారా ప్రభుత్వాసుపత్రుల నుంచి గరిష్ట ప్రయోజనాలను ప్రజలకు అందించే దిశగా కృషి చేయాలని మంత్రి కోరారు.

ఈ మేరకు వైద్యులు, ఇతర సిబ్బంది, ఆసుపత్రుల పనితీరును ప్రతి నెలా సమీక్షించి, లోపాలను సవరించడానికి తగు చర్యల్ని చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

**శానిటేషన్ సేవలను పకడ్బందీగా నిర్వహించాలి :** ప్రభుత్వాసుపత్రుల్లో పారిశుధ్య సేవలను అందించడానికి గత ఏడాది కొత్త ఏజెన్సీలను నియమించిన నేపథ్యంలో, హాజరు నమోదు వంటి అంశాల్లో ఎదురైన సాంకేతిక సమస్యల కారణంగా ఈ సేవల్లో కొంత మేర లోటు ఏర్పడి, ఫలితంగా ఆసుపత్రులకొచ్చేవారిలో కొంత అసంతృప్తి పెరిగిన అంశాన్ని మంత్రి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు కారణమైన సాంకేతిక అంశాలను పరిష్కరించినందున పూర్తి స్థాయిలో పారిశుధ్య సిబ్బందిని విధుల్లో నియమించి శానిటేషన్ సేవలు ఆశించిన స్థాయిలో అందేవిధంగా ఆసుపత్రులు మరియు మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు తగు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఈ అంశంలో ఎటువంటి నిర్లక్ష్యాన్నీ ప్రభుత్వం ఉపేక్షించదని స్పష్టం చేశారు.

**నూతన జోన్ల విధానం-పరిణామాలు :** ప్రెసిడెన్షియల్ ఆర్డినెన్స్-2025 ప్రకారం రాష్ట్రాన్ని 6 జోన్లు, 2 మల్టిపుల్ జోన్లుగా విభజించి ఆమేరకు ప్రభుత్వ సిబ్బంది పునర్నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా గతంలో 4 జోన్ల వారీగానూ, రాష్ట్రక్యాడర్ గానూ పనిచేసే సిబ్బందిని 6 జోన్లు , 2 మల్టిపుల్ జోన్లు, రాష్ట్రస్థాయి క్యాడర్ గా నిర్ధారించాల్సి ఉంటుంది. దీని ప్రభావం సిబ్బంది కొత్త నియామకాలు, పదోన్నతులు, బదిలీలపై ఉంటుంది. అటువంటి పరిణామాల తీరును, ప్రజారోగ్య వ్యవస్థ పనితీరుపై వాటి ప్రభావాన్ని మంత్రి లోతుగా సమీక్షించారు.

ప్రెసిడెన్షియల్ ఆర్డర్-1975 ప్రకారం జిల్లాలు, జోన్లు, రాష్ట్ర క్యాడర్‌గా గుర్తించబడిన వివిధ తరగతుల సిబ్బంది, ఇందుకు సంబంధించి 2025 ఆర్డర్ కింద చేసిన ప్రతిపాదనలను మంత్రి తులనాత్మకంగా సమీక్షించారు. ప్రజారోగ్య వ్యవస్థ ప్రత్యేక అవసరాలను దృష్టిలో పెట్టుకుని తాజా ప్రతిపాదనల్లో కొన్ని మార్పులను రాష్ట్ర ప్రభుత్వానికి సూచించాలని మంగళవారంనాటి సమావేశంలో నిర్ణయించారు. డిఎంఈలో పనిచేసే అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆపై స్థాయి వైద్యులను, డియస్‌హెచ్ కింద పనిచేసే సివిల్ సర్జన్ స్పెషలిస్టులను రాష్ట్ర స్థాయి సిబ్బందిగాను, డిపిహెచ్ మరియు డియస్‌హెచ్ లలో పనిచేసే సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, డెంటల్ అసిస్టెంట్ సర్జన్లను మల్టీజోనల్ క్యాడర్ గాను పరిగణించాలని రాష్ట్ర ప్రభుత్వానికి మంత్రిత్వ శాఖ సూచించనుంది. పాలనా సిబ్బందిని అవసరాల మేరకు జిల్లా, జోనల్, మల్టీజోనల్ సిబ్బందిగా పరిగణిస్తారు.

**30 రోజుల్లో జవాబివ్వాలి :** వివిధ ప్రధానాంశాలు, సమస్యలపై ప్రజా ప్రతినిధులు, ఇతర ప్రముఖులు, ప్రజల నుంచి వస్తున్న వినతులపై మంత్రి కార్యాలయానికి సంబంధిత అధికారులు 30 రోజుల్లోగా సమాధానాన్ని తమకు నివేదించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. ఈ విషయంపై పలు సందర్భాల్లో అధికారులు నెలల పాటు సమయం తీసుకోవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ అని, వారు లేవనెత్తిన అంశాలపై త్వరగా స్పందించాల్సిన విషయాన్ని మంత్రి స్పష్టం చేశారు.

**కొత్త నియామకాలకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక :** గత రెండేళ్ల కూటమి పాలనలో 3,000 కు పైగా వైద్యులు, ఇతర సిబ్బందితో కలిపి దాదాపు 12,000 సిబ్బంది నియామకాలు జరిగాయని మంత్రి తెలిపారు. ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని గరిష్ట స్థాయిలో రానున్న మూడేళ్లలో ఖాళీలను భర్తీ చేసేందుకు సమగ్ర ప్రణాళికలను రూపొందించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు.

**సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తం :** వర్షాకాలం ప్రారంభమవుతున్న తరుణంలో...మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలడంపై ఉత్తర కోస్తా జిల్లాల్లో సంబంధిత సిబ్బంది సంసిద్ధతను సోమవారంనాడు విశాఖపట్నంలో సమీక్షించిన మంత్రి, రాష్ట్రస్థాయి సమీక్షను మంగళవారంనాడు చేపట్టారు. గత మూడేళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా, జిల్లాల వారీగా దోమల ద్వారా విస్తరించే మలేరియా, డెంగీ, చికున్ గున్యా కేసుల వివరాలను మంత్రి సమీక్షించారు. ఈ వ్యాధుల ప్రబలడాన్ని తగ్గించడానికి తగు లైన్ డిపార్ట్‌మెంట్లతో పూర్తిగా సమన్వయం చేసుకుని, గరిష్టస్థాయిలో నివారణా చర్యల్ని చేపట్టాలని, క్షేత్ర స్థాయి సిబ్బందిని నిరంతరం అప్రమత్తంగా ఉంచాలని మంత్రి ఆదేశించారు. జిల్లా స్థాయిలో డిఎంహెచ్వోలు ప్రతి వారం పరిస్థితిని సమీక్షించి తగు చర్యల్ని చేపట్టాలని మంత్రి సూచించారు. వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి యస్.సురేష్ కుమార్, జాయింట్ సెక్రటరీ మరియు ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ఏపీశాక్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్ స్మరణ్ దాస్, డిఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్, డిహెచ్ డాక్టర్ పద్మావతి, ఇతర విభాగాల అధికారులు సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

## మోదీ-షా నాయకత్వంలో ఛత్తీస్‌గఢ్ మావోయిస్టు రహితం

- దేశ నిర్మాణంలో యువతే కీలక శక్తి: ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నాయకత్వంలో ఛత్తీస్‌గఢ్‌ను మావోయిస్టు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దామని ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ తెలిపారు. దేశాభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమని, సేవాభావం, అంకితభావం, జాతీయ చైతన్యంతో ముందుకు వస్తే భారత్‌ను మరింత శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దవచ్చని పిలుపునిచ్చారు.

"2014 తర్వాత భారతదేశంలో పరివర్తన - యువత పాత్ర" అంశంపై నిర్వహించిన మేధో సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయ్ శర్మ మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో యువత తమ మేధస్సు, శక్తి, సమయాన్నిసమాజ సేవకు అంకితం చేయాలని సూచించారు. కృత్రిమ మేధ (ఏఐ), సెర్చ్ ఇంజిన్లకే పరిమితం కాకుండా ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారంలో భాగస్వాములు కావాలని అన్నారు. రాజకీయాలు ప్రతి పౌరుడి బాధ్యతేనని, ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములేనని పేర్కొన్నారు.

విద్యార్థి పరిషత్ కార్యకర్తగా ఉన్న సమయంలో అమిత్ షా కేవలం రూ.100తో అపరిచిత ప్రాంతంలో సంస్థాగత నిర్మాణాన్ని ప్రారంభించి, ఆరు నెలల్లో బలమైన వ్యవస్థను ఏర్పాటు చేసిన విషయాన్ని ఉదాహరణగా వివరించారు.

అలాగే ఛత్తీస్‌గఢ్‌లో ఆదిశేషు కేవలం రూ.50తో సంస్థాగత విస్తరణ చేపట్టిన సంఘటనను ప్రస్తావిస్తూ, విజయానికి వనరుల కంటే సంకల్పం, కృషి ముఖ్యమని చెప్పారు. రాజకీయాల్లో విజయం డబ్బుతో కాకుండా నిబద్ధత, సేవాభావం, ప్రజల విశ్వాసంతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

భారతీయ జనసంఘ్ స్థాపనకు 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ సేవలను విజయ్ శర్మ స్మరించారు. జాతీయవాదమే దేశాభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని, అభివృద్ధి, పారదర్శక పాలనకు ప్రజలు ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారు దిలీప్ రచించిన పుస్తకాన్ని త్వరలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అందజేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అడిషనల్ సొలిసిటర్ జనరల్ చన్నా ధనంజయ్, బార్ కౌన్సిల్ సభ్యుడు ఉప్పలపాటి శ్రీనివాసరాజ్, ఎస్ఆర్‌కే కళాశాల చైర్మన్ కృష్ణ, బీజేపీ సీనియర్ నాయకుడు పీయూష్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్న డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం

- డా. బి.సి. రాయ్ విగ్రహావిష్కరణ - వైద్య రంగంలో విశిష్ట సేవలందించిన 10 మంది ప్రముఖ వైద్యులకు సత్కారం
- డా. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఉపకులపతి డా. పులాల చంద్రశేఖర్

విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్): భారతరత్న డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం జూలై 1 న నిర్వహించే జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఈ ఏడాది కూడా విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఘనంగా నిర్వహిస్తుందని ఉపకులపతి డా. పులాల చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై భారతరత్న డాక్టర్ బి.సి. రాయ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం వైద్య సేవలు, వైద్య విద్య, పరిశోధన, సమాజ సేవ రంగాల్లో విశిష్ట సేవలందించిన 10 మంది ప్రముఖ వైద్యులను ఘనంగా సన్మానిస్తామన్నారు.

మానవ సేవకు జీవితాన్ని అంకితం చేసిన వైద్యుల సేవలను గుర్తించి గౌరవించడం విశ్వ విద్యాలయానికి గర్వకారణమని తెలిపారు. వారి సేవలు భావితర వైద్యులకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

కార్యక్రమానికి విశ్వ విద్యాలయ ఉపకులపతి డా. పులాల చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డా. టి. సాయి సుధీర్, వైద్య విద్య సంచాలకులు, ఉన్నతాధికారులు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, వైద్యులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొంటారన్నారన్నారు.

అల్లోపతి, దంత వైద్యం, నర్సింగ్, ఆయుర్వేదం, హోమియోపతి, యునాని వైద్య రంగాలకు చెందిన విశిష్ట వైద్యులను ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం సత్కరించనుందని ఆ ప్రకటనలో వీసీ చంద్రశేఖర్ తెలియజేశారు

అధ్యాపకులు, వైద్యులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, ప్రజలు ఈ వేడుకలో పాల్గొని వైద్య వృత్తికి నివాళులర్పించాలని రిజిస్ట్రార్ డా. టి. సాయి సుధీర్ కోరారు.

## ప్రతి వైద్యుడు సమాజానికి అమూల్యమైన ఆస్తి

- ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసం మరింత పెరిగేలా వైద్యులు కృషి చేయాలి: మంత్రి సత్యకుమార్ యాదవ్
- నేడు జాతీయ వైద్యుల దినోత్సవం
- ప్రొద్దుటూరు వేడుకల్లో పాల్గొననున్న మంత్రి సత్యకుమార్



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా వైద్యులు సేవాభావంతో పనిచేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ప్రజలకు అత్యున్నత ప్రమాణాలతో వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఆ లక్ష్య సాధనలో వైద్యుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. జూలై 1న జరగనున్న జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని వైద్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ మంగళవారం ఆయన ప్రత్యేక సందేశాన్ని విడుదల చేశారు.

గడిచిన రెండేళ్లలో రోగుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా 3 వేల మంది వైద్యులను నియమించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల విస్తరణ, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు, నిపుణులైన వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది నియామకాలను జీరో వేకెన్సీ విధానంలో చేపడుతున్నామని చెప్పారు. డిజిటల్ ఆరోగ్య సేవలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు చికిత్సతో సమానంగా వ్యాధి నివారణకూ ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు.

"ప్రాణాలను కాపాడే ప్రతి వైద్యుడు సమాజానికి అమూల్యమైన ఆస్తి. ఒక వైద్యుడి విజ్ఞానం రోగికి చికిత్స అందిస్తే, అతని సేవాభావం కుటుంబానికి భరోసా కల్పిస్తుంది. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో వైద్యులు కేవలం చికిత్స చేసే నిపుణులు మాత్రమే కాదు, ప్రజలకు మార్గదర్శకులు కూడా" అని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన యోగాంధ్ర ఉద్యమం ద్వారా ఆరోగ్యకర జీవనశైలిపై ప్రజల్లో విశేష అవగాహన కల్పించినట్లు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రి అంటే నాణ్యమైన వైద్యం, మానవీయ సేవలు, సమయానుకూల చికిత్స అనే నమ్మకం ప్రతి కుటుంబంలో ఏర్పడేలా వైద్యులు మరింత కృషి చేయాలని మంత్రి కోరారు. రోగుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వైద్య వృత్తిపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. వైద్యుల సేవలతోనే ఆరోగ్యవంతమైన, సుస్థిరమైన, అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్ నిర్మాణం సాధ్యమవుతుందని, ప్రజారోగ్య పరిరక్షణలో వైద్యులే ప్రభుత్వ అసలైన బలగమని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కడప జిల్లా ప్రొద్దుటూరులో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొని పలువురు సీనియర్ వైద్యులను సత్కరించనున్నట్లు ఐఎంఏ ప్రతినిధులు వినోద్ కుమార్, వరుణ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## టీడీపీ కార్యకర్త మృతిపై ప్రగాఢ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సంతాపం



వేమూరు(జర్నలిస్ట్ ఫైల్):భట్టిప్రోలు మండల కేంద్రంలో జరిగిన విషాదకర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వేమూరు మండలం కోడిపర్రు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త చేబ్రోలు స్మిత్ నర్ (35) పార్థివ దేహానికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు నివాళులర్పించారు. మృతుడి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ విషాదాన్ని తట్టుకుని ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు సూచించారు.

బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మృతుడికి నివాళులర్పించారు.

## 30 లక్షల తో సింగరాయ స్వామి గుడి నిర్మాణానికి భూమి పూజ



- టిటిడి శ్రీవారి ట్రస్టు ద్వారా నిధులు విడుదల
- ఈఓ ఎ కృష్ణయ్య వెల్లడి

బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్): కడప జిల్లా మైదుకూరు నియోజకవర్గం బ్రహ్మంగారిమఠం నుండి వనిపెంట కు పోవు రోడ్డునందు శ్రీ ఈశ్వరీదేవి గృహ సమీపమున ప్రధాన రహదారి పక్కనే ఉన్న శ్రీ కొండ శింగరాయ స్వామి పాత దేవస్థానమును పూర్తిగా తొలగించి నూతనంగా గుడి నిర్మించేందుకు 02- 07- 2026 న ఉదయం 10 గంటలకు భూమి పూజా కార్యక్రమం ఉన్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎ కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ కొండా సింగరాయ గుడి నిర్మాణమునకు తిరుమల తిరుపతి దేవస్థానం వారి శ్రీవారి ట్రస్ట్ ద్వారా 30 లక్షల రూపాయలు మంజూరు కాగా శ్రీయుత కమీషనరు దేవదాయ ధర్మదాయశాఖ గొల్లపూడి విజయవాడ వారు ఆలయము పునర్నిర్మాణము చేయుటకు మంజూరు వుత్తర్వులు ఇచ్చారు అని ఆయన తెలిపారు.. కావున దేవస్థానమును పునర్నిర్మాణం చేపట్టుటకు పోలీసు శాఖ, రెవిన్యూ శాఖ, దేవదాయశాఖ సమక్షంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తాం అని ఆయన తెలిపారు. కాబట్టి కందిమల్లాయపల్లె గ్రామస్తులు, స్వామి వారి భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

## ఎస్ ఐ ఆర్ గూర్చి అవగాహన

కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు ఆదేశాల మేరకు కాకుమాను మండలం కొండపాటూరు గ్రామ ఎస్ తి ఏరియా పరిధి లో సర్ (స్పెషల్ ఇంటెన్సివే రెవిషన్ ) కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించడం, ఓటరు ఎనిమరేషన్ ఫార్మ్ పూర్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొండపాటూరు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తోట నాగ ఫణీంద్రనాథ్ , ఐటిడిపీ నియోజకవర్గ అధ్యక్షులు గింజుపల్లి నవీన్, యూనిట్ ఇన్చార్జి గింజుపల్లి వంశీ కృష్ణా, బూత్ ఇన్చార్జి రామినేని వీరయ్య, తోట నాయుడు బాబు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పాల్గొనడం జరిగింది.

# యంగ్ ఇండియా స్కూల్ కొత్తగూడెంకి కీర్తిపతాక

- విద్యాహబ్‌గా మారనున్న కొత్తగూడెం జిల్లా కేంద్రం..
- రూ.200కోట్లతో అత్యాధునిక హంగులతో యంగ్ ఇండియా స్కూల్..
- వచ్చే విద్యాసంవత్సరలో అందుబాటులోకి రానున్న స్కూల్..
- నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు..



కొత్తగూడెం జూన్ 30 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఏర్పాటు కానున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కొత్తగూడెం నియోజకవర్గానికి ఒక కీర్తి పతాకమని, ఈస్కూల్ ఏర్పాటుతో కొత్తగూడెం జిల్లా కేంద్రం గొప్ప విద్యాహబ్‌గా మారబోతుందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. నియోజకవర్గంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణ పనులను సోమవారం ఆయన అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. అనంతరం జరిగిన విలే కర్ల సమావేశంలో మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల విద్యార్థులకు ఒకే క్యాంపస్‌లో విద్యను అందించాలనే ప్రభుత్వ ఆలోచన ఎంతో అభినందనీయమన్నారు. ఈప్రాజెక్టు కింద కొత్తగూడెం క్యాంపస్‌లో రూ. 200కోట్ల అంచనా వ్యయంతో అత్యంత అత్యాధునిక హంగులతో ఈ స్కూల్ పనులు శరవేగంగా సాగుతు న్నాయన్నారు. 25.475 ఎకరాల భారీ విస్తీర్ణంలో 5,38,246 చదరపు అడుగుల ప్లింత్ ఏరియాతో నిర్మిస్తున్న ఈ భారీ నిర్మాణాల్లో అకడమిక్ బ్లాక్, జూనియర్, సీనియర్ హాస్టల్ బ్లాకులు, డైనింగ్, కిచెన్‌ల తోపాటు సిబ్బంది కోసం క్వార్టర్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఈ సరికొత్త స్కూల్‌ను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్దేశించుకొని పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. అంతే కాకుండా పర్యావరణ హితంగా ఉండేలా సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, సౌర, పవన విద్యుత్ వ్యవస్థలను, నీటి సంరక్షణ కోసం రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ విధానాలను ఇక్కడ అమలు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో రవాణా సౌకర్యాన్ని మెరుగు పర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని, ఇప్పటికే రోడ్లు, బ్రిడ్జీలు, అండర్ బ్రిడ్జీలు, ఓవర్‌బ్రిడ్జీలు, ఔటర్ రిగు రోడ్లు కొన్ని నిర్మాణ దశలో ఉండగా మరికొన్నింటికి మంజూరు లభించిందని తెలిపారు. అన్నికులాలవారికి 17 కమ్యూనిటీ హాల్స్ మంజూరు చేయడం జరిగిందన్నారు. ఎయిర్పోర్టు, అంతర్జాతీయక్రికెట్ స్టేడియం, క్రీడా మైదానాలు, జిమ్ ఏర్పాటు కాబోతున్నాయ న్నారు. ఈ సమావేశంలో సాబీర్‌పాషా, మేయర్ మూడ్ గణేష్, కమిషనర్ సుజాత, డిఈఓ వాసంతి, పాఠశాలల భవనాల శాఖాధికారులు హేమచంద్రరావు, రాజగోపాల్, నాయకులు మురళీ, యూసుఫ్, ధర్మరాజు, కార్పొరేటర్లు శంకర్, దుర్గ, సుధాకర్, పద్మ, ఆకాంక్ష, హిమశ్రీ, నర్సింహ, విజయ్, తులసమ్మ, సహేరా, కళావతి పాల్గొన్నారు.

# సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

- సంస్థను కాపాడుతున్న అధికారుల పట్ల నిర్లక్ష్య వైఖరి వీడాలి
- నిరసన దీక్షాశిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



కొత్తగూడెం సింగరేణి జూన్ 30 (జర్నలిస్ట్ ఫైల్) : సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, వారి పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని ఎమ్మెల్యేకూనంనేని సాంబశివరావు అన్నారు. ఐఎంఓఏ సింగరేణి శాఖ ఆధ్వర్యంలో సింగరేణిప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం అధికారులు నిరసన దీక్షను చేపట్టారు. ఈదీక్షా శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించి వారికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. రాత్రింబవళ్లుశ్రమించి సింగరేణి సంస్థనులాభాల బాటలో నడిపిస్తున్న అధికారుల పట్ల యాజమాన్యం, ప్రభుత్వాల నిర్లక్ష్యవైఖరి వీడాలన్నారు. అధికారులు పే రివిజన్, అలవెన్సులు, పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి అధికారుల సమస్యలపై చొరవ చూపాలని లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సాబీర్‌పాషా, మూడ్‌గణేష్, వంగా వెంకట్, గట్టయ్య, కిష్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ ఆదర్శప్రాయులు : ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు

- అందరి సహకారంతోనే అభివృద్ధి : పిఓ రాహుల్



భద్రాచలం జూన్ 30 (జర్నలిస్ట్ ఫైల్) : ఒక అధికారి ప్రజాసేవను తన శ్వాసగా భావిస్తే ఆ ప్రాంతం ఎలా మారుతుందో చెప్పడానికి భద్రాచలం ఐటిడిఏ పిఓ బి.రాహుల్ ప్రత్యక్ష నిదర్శనమని ఎమ్మెల్యే తెల్లం వెంకట రావు ప్రశంసించారు. ఐటిడిఏ సమావేశహాల్లో సోమవారం నిర్వహించిన పిఓ రెండేళ్లపాలన సక్సెస్ మీట్‌లో ఆయన పాల్గని మాట్లాడారు. పిఓ గత రెండేళ్లలో ఆయన తన కార్యక్షేత్రంలో సృష్టించిన విప్లవాత్మక మార్పులు, వెనుకబడిన గిరిజనప్రాంతాల్లో నూతన ఆశలను చిగురింపచేశాయన్నారు. పరిపాలన అంటే కేవలం ఫైళ్లకు పరిమితం కాదని, అది అట్టుడుగు వర్గాల జీవనప్రమాణాలను మెరుగుపరిచే ఒక సాధనమని రాహుల్ నిరూపించారన్నారు. ఆయన నిర్మించన గిరిజన వికాస సౌధం నేడు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం తనకెంతో గర్వ కారణంగా ఉందన్నారు. ఆదివాసీల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నఈ ప్రజా బాంధుబుడి ప్రస్థానం భావితరాలకు ఒక స్ఫూర్తిదాయక పాఠమని అభినందించారు.

**అందరి సహకారంతోనే సక్సెస్ : పిఓ రాహుల్..**

అందరి సహకారంతోనే భద్రాచలం ఐటిడిఏని ముందుకు తీసుకెళ్లడం జరిగిందని పిఓ రాహుల్ తెలిపారు. ప్రధానంగా ఎమ్మెల్యే కూడా ఎంతగానో సహకరించారని తెలిపారు. యూనిట్ అధికారులుకూడా బాధ్యతాయు తంగా పనిచేశారని ప్రసంశించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంచేం దుకు ఉద్దీపకం కార్యక్రమాన్ని అమలు చేశామన్నారు. గిరిజన మ్యూజియంను ఆధునీకరించి 1.5లక్షల మంది సందర్శకులను ఆకర్షించేలా తీర్చిదిద్దడమే కాకుండా తెలంగాణ రాష్ట్ర గ్రామీణ పర్యాటక పురస్కారాన్ని ఢిల్లీ నుంచి రూ.1కోటి నిధులను అందుకోవడం సంతోషాన్నిచ్చిందన్నారు. గిరిజన ఇలవేల్పుల చరిత్రను తెలిపే పుస్తకాన్ని వెలుగులోకి తేవడం కూడా సంతోషకరమన్నారు. గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పిస్తూ ప్రారంభించిన భద్రగిరిమార్ట్ నేడు గిరిజన కుటుంబా లకు ఆర్థిక భరోసానిచ్చే ప్రధాన వేదికగా మారిందన్నారు. ఎమ్మెల్యే యూనిట్ అధికారులుసిబ్బంది సమక్షంలో పిఓ సాధించినప్రగతి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్‌రాజ్, సర్పంచ్ పూనెం కృష్ణ, ఇతర యూనిట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జూలై 12న సైరా ది వార్ ఆఫ్
# డాన్స్ టూ స్టేట్ లెవల్ డాన్స్ కాంపిటీషన్స్

- బ్రోచర్‌ను ఆవిష్కరించిన సురేష్ రెడ్డి



కొత్తగూడెం జూన్ 30 (జర్నలిస్ట్ ఫైల్) : కళ్యాణ్ సుమిత్ర ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో జూలై12న స్థానిక సిఆర్‌క్లబ్ వేదికగా నిర్వహించబోతున్న సైరా ది వార్ ఆఫ్‌డ్యాన్స్ టూ స్టేట్ లెవల్ కాంపిటీషన్స్ జరగనున్నట్లు శ్యామల గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎన్.సురేష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. నృత్యకళను ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ రాష్ట్రస్థాయి పోటీలు ప్రతిభావంతులైన కళాకారులకు గొప్ప అవకాశంగా నిలుస్తాయన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కళాకారులు, కళాభిమానులు అధిక సంఖ్యలో పాల్గని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పోటీల్లో పాల్గనే కళాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గనేవారు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవడానికి 7702395571 నెంబర్‌ను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

# బాలల సంరక్షణకు అన్ని డిపార్టుమెంట్లు సమన్వయంతో పనిచేయాలి

- ఆపరేషన్ ముస్కాన్ పోస్టర్లను ఆవిష్కరించిన ఎస్పీ రోహిత్ రాజు



భద్రాద్రి కొత్తగూడెం జూన్ 30 (జర్నలిస్ట్ ఫైల్) : బాలల సంరక్షణకు అన్ని డిపార్టుమెంట్లు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. జనవరి 1నుండి నెలరోజులపాటు నిర్వహించబడే ఆపరేషన్ ముస్కాన్ 12వ విడత కార్యక్రమంపై ఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం కాన్ఫరెన్స్‌హాల్లో అధికారులతో సమావేశం జరిగింది. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం, స్త్రీ శిశు సంక్షేమశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, కైలాష్ సత్యర్థి చిల్డ్రన్ ఫౌండేషన్ ఎన్జీఓ, విద్యాశాఖ, వైద్య, కార్మిక శాఖకి చెందిన అధికారులు పాల్గన్నారు. ఈసమావేశంలోఎస్పీ ఆపరేషన్ ముస్కాన్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. గత 12 సంవత్సరాలుగా ఆపరేషన్ స్మైల్ & ముస్కాన్ భారతదేశ వ్యాప్తంగా తప్పిపోయిన పిల్లలను, భిక్షాటన చేస్తున్న పిల్లలను, నిరాధరణ కలిగిన పిల్లలకు, బాల కార్మికులను సంరక్షించే ప్రాథమిక ఉద్దేశాలతో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం వలన బాధితులైన పిల్లల్ని సంరక్షించి వారి కుటుంబాలకు అప్పగించడం జరుగుతుందని, ఈ సంవత్సరం 12వ విడత ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని జూలై 1 నుంచి 31వరకు జిల్లా పరిధిలో నిర్వహిస్తూ బాలల సంరక్షణ కోసంప్రత్యేకంగా పోలీస్ టీంలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొత్తగూడెం జిల్లా పరిధిలో ఎవరైనా 18 సంవత్సరాల్లోపు పిల్లల్ని హింసించినా, బాల కార్మికులుగా మార్చినా అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో డిసిఆర్బిడిఎస్పీ మల్లేష్ స్వామి, డిస్ట్రిక్‌వెల్ఫేర్ ఆఫీసర్ లెనినా స్వర్ణలత, డిసిపిఓ హరికుమారి, ఎస్బి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ రాము, అసిస్టెంట్ లేబర్‌ఆఫీసర్స్ నాగరాజు, శాస్త్రి, ఏసుపాదం, సైదులు, రాజేష్, కమిటీమెంబర్లు, ఎస్ఐలు రమాదేవి, రాంబాబు, రామ్మూర్తి, రావూఫ్, వెంకన్న, సారంగపాణి, లక్ష్మణ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలపై పెరుగుతున్న విశ్వాసం

- యుపిఎస్ పాఠశాలలో చేరిన 28 మంది విద్యార్థులు



కొత్తగూడెం జూన్ 30 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. వేంసూరు మండలంలోని రామన్నపాలెం ప్రాథమికోన్నత ప్రభుత్వ పాఠశాలలో సోమవారం 28 మంది విద్యార్థులు ప్రయివేట్ పాఠశాలల నుంచి చేరారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాల పట్ల ఆకర్షితులైన గ్రామప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకు వచ్చారు. సర్పంచ్ జుంజునూరి కృష్ణకుమారి వరప్రసాద్ తన కుమార్తె,కుమారుడు చస్మిత, రేవంత్‌ను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ విద్యపై తన విశ్వాసాన్ని చాటి చెప్పారు. గ్రామ ప్రజలను కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోచేర్పించాలని ఆమెకోరారు. ఈ కార్యక్రమంలో విద్యాధికారి చలంచర్ల వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ శంకర్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు భాను, గ్రామప్రజలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని గడువులోపు పూర్తి చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి






భద్రాద్రి కొత్తగూడెం జూన్ 30 (జర్నలిస్ట్ ఫైల్) : ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటరు వివరాల సేకరణ ఫారాల పంపిణీని నిర్ణీత గడువులోపు పూర్తి చేసి ప్రతి అర్హత కలిగిన ఓటరుకి ఫారాం అందేలా చర్యలు చేపట్టాలని తెలంగాణరాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం అమలుపై సమీక్షనిర్వహించి పలుకీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా కలెక్టర్ అంకిత్ ఐడిఓసి కార్యాలయం, క్యాంపు కార్యాలయం నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రఎన్నికల అధికారులు మాట్లాడుతూ ఓటరు వివరాల సేకరణ ఫారాలను బూత్‌స్థాయి అధికారులు మాత్రమే ఇంటింటికివెళ్లి పంపిణీ చేయాలని స్పష్టంచేశారు. ఎట్టి పరిస్థితుల్లో అనధికార వ్యక్తులతో ఫారాల పంపిణీ చేపట్టరాదన్నారు. ప్రతీ బిఎల్ఓ తన పరిధిలోనిప్రతి ఇంటిని సందర్శించి అర్హత కలిగిన ఓటర్లకు ఫారాలను అందచేయడంతోపాటు వాటిని సక్రమంగా నింపి నిర్ణీత గడువులోపు సమర్పించేలా ప్రజలకుఅవగాహన కల్పించాలని సూచించారు. ఫారాలనుసమర్పించిన ఓటర్ల వివరాలనే ముసాయిదా ఓటరు జాబితాలో కొనసాగిస్తామని, అందువల్ల ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా తన ఫారాన్ని సమర్పించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలను క్షేత్ర స్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. బూత్‌స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటరు వివరాల సేకరణ ఫారాలను పంపిణీ చేయడం తోపాటు నిర్ణీత గడువులోపు తిరిగి సేకరించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాల న్నారు. ప్రత్యేక సంక్షిప్తసవరణ కార్యక్రమాన్ని నిబంధనలకు అనుగుణంగా, ఎలాంటి లోపాలకు తావులేకుండా విజయవంతం గా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల శాఖ సూపరిండెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల మాస్టర్‌ట్రైనర్ పూసపాటి సాయికృష్ణ, ఎన్నికల శాఖ సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా త్రివేణి ప్రైమరీ స్కూల్లో బ్లూడే వేడుకలు



కొత్తగూడెం జూన్ 30 (జర్నలిస్ట్ ఫైల్) : త్రివేణి ప్రైమరీ స్కూల్‌లోచిన్నారులలో రంగులు పట్ల అవగాహన, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసాన్ని పెపొందించే ఉద్దేశంతో బ్లూ డే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు నీలిరంగు దుస్తులు ధరించి ఆకట్టుకున్నారు. నీలిరంగుకు సంబంధించిన బెలూన్లు, పూలు, బొమ్మలు, వివిధ వస్తువులను తీసుకువచ్చి ప్రదర్శించారు. ఉపాధ్యాయులు నీలిరంగు ప్రాధాన్యతను, ప్రకృతిలోని ఆకాశం, సముద్రం వంటి నీలిరంగు అంశాల గురించి పిల్లలకుసులభంగా వివరించారు. పాటలు, నృత్యాలు, ఆటలు, రంగుల గుర్తింపు కార్యక్రమాల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గని తమ ప్రతిభను చాటారు. ఈ కార్యక్రమంలో పాల్గన్న విద్యార్థులను డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి, జగదీశ్వరి అభినందించారు. సిఆర్ కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపల్ సూర్యనారాయణమూర్తి, శ్రీనివాస్‌సింగ్, సౌజన్య పాల్గని విద్యార్థులను అభినందించి ఇటువంటి కార్యక్రమాలు చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఎంతో దోహదపడతాయన్నారు.

# జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- ఘనంగా టియుడబ్ల్యుజె (ఐజేయు) డివిజన్ మహాసభ..
- పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు



భద్రాచలం జూన్ 30 (జర్నలిస్ట్ ఫైల్) : సమాజంలో కీలకపాత్ర పోషిస్తున్న జర్నలిస్టులకుప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. పట్టణంలో రాఘవ నిలయంలో సోమవారం జరిగిన తెలంగాణయూనియన్ ఆఫ్‌వర్కింగ్ జర్నలిస్టు డివిజన్‌మహాసభ ఆయూనియన్ జాతీయ కౌన్సిల్ మెంబర్ బివి.రమణారెడ్డి, జిల్లా అధ్యక్షులు జాగు వెంకటరత్నం, కార్యదర్శి జునుమాల రమేష్‌ల సమక్షంలో విజ్జిగిరి రాజాకిరణ్ సభాధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన జర్నలిజం రంగంలో పనిచేస్తున్న విలేకరుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి వారి సంక్షేమ కార్యక్రమాల అమలుకు తన వంతు పూర్తిసహకారం ఉందిస్తామని హామీ ఇచ్చారు. ఘనంగా టియుడబ్ల్యుజె డివిజన్ మహాసభ అనంతరం యూనియన్ మహాసభ జరిగింది. అధ్యక్షుడిగా భూక్య రంజిత్‌నాయక్, ఉపాధ్యక్షుడిగా భూక్య రంజిత్‌నాయక్, ఉపాధ్యక్షులుగా బండారి మహేష్‌యాదవ్, కాటా సత్యం, పందేలపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా పరుచూరి రవీంద్రబాబు, సహాయ కార్యదర్శులుగా షేక్‌ఖాసీం,పసుపులేటి బాబు, కోశాధికారిగా టల్లె రాంబాబు, కార్యవర్గసభ్యులుగా విజయ్, వినోద్, సతీష్, శ్రీనివాసరావు, అనిల్, వెంకట్, వెంకటేశ్వరరావులు ఎంపికయ్యారు. ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులుగా శ్రీహరి, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, పాకాల శివగౌడ్, కార్యదర్శిగా జయరాం, సహాయ కార్యదర్శులుగా మోహన్‌రావు, జెట్టి రామకృష్ణ, కోశాధికారిగా బాలకిరణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అన్వేష్‌రెడ్డి,కార్యవర్గసభ్యులుగా రామ లక్ష్మణ్, జగన్‌లు ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, పలువురు ప్రముఖులు, డివిజన్‌లోని మీడియా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్‌లో యూనియన్ పటిష్టతకు శక్తివంచన లేకుండా కార్యవర్గం కృషి చేయాలని సూచించారు.

## సహకారం ద్వారా సమృద్ధి
# అనే లక్ష్యంతోనే సహకార వారోత్సవాలు

- సహకార పతాకాన్ని ఎగురవేసిన కొత్వాల



పాల్వంచ జూన్ 30 (జర్నలిస్ట్ ఫైల్) : సహకారం ద్వారా సమృద్ధి అనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం ఈనెల 29నుండి జూలై 6 వరకు సహకార వారోత్సవాలు జరిపేలా చర్యలు చేపట్టిందని డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. సహకార వారోత్సవాల్లో భాగంగా సోమవారం సొసైటీ కార్యాలయం ఎదుట సహకార జెండాను ఎగుర వేశారు. సహకారం ద్వారా సమృద్ధి అనే లక్ష్యాన్ని సాకారం చేయడానికి సంపూర్ణ హృదయంతో కృషి చేస్తానని రైతులచే కొత్వాల ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శక్తివంతమైన సహకార సంస్థలు దేశానికి బలమైన పునాదిగా నిలుస్తాయి అన్నారు. సహకార సంఘాల రైతుల శ్రేయస్సుకై అనేక కార్యక్రమాలు చేపడుతున్నదని సంఘాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఏ.లక్ష్మీహరిత, సొసైటీ డైరెక్టర్లు బుడగం రామ్మోహన్‌రావు, కనగాల నారాయణరావు, పాపారావు, సీతారాంబాబు, భూక్యా కిషన్, సిఈఓ జి.లక్ష్మీనారాయణ, లక్ష్మీ, మురళీ, రైతులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దు : జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం, (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ములకలపల్లి మండలంలో పర్యటించి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంతో పాటు ములకలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.మొదట ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలు పంపిణీ చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ప్రతి ఓటరికి ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని బీఎల్‌వోలకు సూచించారు. ఫారాల పంపిణీ సందర్భంగా ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లే సమయంలో ప్రతి కుటుంబాన్ని తప్పనిసరిగా కలుసుకుని అవసరమైన వివరాలను నమోదు చేయాలని, ఏ ఒక్క అర్హుడూ మిగిలిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అనంతరం దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఓటరు జాబితా సవరణను పూర్తిస్థాయి పారదర్శకతతో, భారత ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రతి దరఖాస్తును నిబంధనల మేరకు పరిశీలించి అర్హులైన వారి పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలు కూడా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని తమ వివరాలను పరిశీలించుకుని అవసరమైన ఫారాలను గడువులోపు సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం ములకలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న చికిత్స విధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇన్‌పేషెంట్ వార్డు, ఔట్‌పేషెంట్ వార్డు, ప్రసూతి గది, రక్త పరీక్షల గది, ఫార్మసీ, ఔషధ నిల్వ కేంద్రం, ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశీలించి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రికి రోజువారీగా వచ్చే ఔట్‌పేషెంట్ల సంఖ్య, చికిత్స పొందుతున్న ఇన్‌పేషెంట్ల సంఖ్య, నిర్వహిస్తున్న రక్త పరీక్షలు, ఇతర నిర్ధారణ పరీక్షల వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా, ఔషధ నిల్వలు ఎంత మేరకు ఉన్నాయో పరిశీలించారు. అవసరమైన మందులు, పరీక్షా సామగ్రి ఎల్లప్పుడూ




అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు, నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన మందులు, పరీక్షా కిట్లు, వైద్య సామగ్రిని తగినంతగా నిల్వ ఉంచాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.ప్రజలకు సీజనల్ వ్యాధుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ చర్యలు, సురక్షితమైన తాగునీటి వినియోగంపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణం, వార్డులు, పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్ స్వాతి బిందు, డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి , వైద్యాధికారి డాక్టర్ సాయి కళ్యాణ్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీకృష్ణ, మెడికల్ సిబ్బంది ఇమ్రాన్, బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) తదితరులు పాల్గొన్నారు.

# రైతు ఆశీర్వాద సభ వాయిదా

**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్):** ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ, ప్రజా కార్యక్రమాలను మెచ్చి వరణ దేవుడు కూడా కారుణించడాని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. భారీ వర్షాల కారణంగా ఈ నెల 30న తలపెట్టిన రైతు ఆశీర్వాద సభను వాయిదా వేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల సభా ప్రాంగణం అంతా బురదమయంగా మారిందని ఆయన చెప్పుకొచ్చారు. ఈ కారణం వల్ల రైతులకి ప్రజలకి కాంగ్రెస్ కార్యకర్తలకి ఎవరికి ఎలాంటి ఇబ్బందులు రాకూడదన్న ఉద్దేశంతోనే సభ నిర్వహణలో మార్పులు చేసినట్లు ఆయన చెప్పుకుచ్చారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలో తలపెట్టిన రైతు ఆశీర్వాద సభ ప్రాంతాన్ని సోమవారం మధ్యాహ్నం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో కలిసి పరిశీలన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ లక్షలాది మంది రైతుల సమక్షంలో ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రులందరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించాలని భావించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం 11 వాతావరణ పరిస్థితుల్లో ఇక్కడ సభ నిర్వహించడం అందరికీ ఇబ్బందికరంగా ఉంటుందని అన్నారు. తొలిరోజు ప్రారంభ సభగా అనుకున్న ఈ కార్యక్రమాన్ని, ఇప్పుడు రైతు భరోసా పంపిణీ పూర్తి అయిన తర్వాత మరింత ఉత్సాహంగా 'రైతు ఆశీర్వాద సభ' పేరుతో ముగింపు వేడుకగా నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వర్షాలు తగ్గిన తరువాత వాతావరణ శాఖ నివేదికలను అనుసరించి ముఖ్యమంత్రి, కేబినెట్ ఈ నిర్ణయం తీసుకుంటుందని ఆయన చెప్పారు. సభ నిర్వహణ తేదీలపై ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే వాతావరణ శాఖ నుంచి వారం రోజుల ముందస్తు అంచనాలను తీసుకుంటుందని ఆయన అన్నారు. జులై నెల 3,



4 తేదీల వరకు వర్షాలు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసేందుకు మరో వారం రోజుల వాతావరణ సమాచారాన్ని సేకరించాలని ఆదేశించాం. వాతావరణ పరిస్థితిని బట్టి ఈ సభను వచ్చే 6, 7 లేదా 8వ తేదీల్లో నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారని డిప్యూటీ సీఎం తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సత్తెపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయిలతో పాటు జిల్లాలోని శాసనసభ్యులంతా సమన్వయంతో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న మిగతా ఎమ్మెల్యేలు, ప్రజలు, రైతాంగ సోదరులు ఈ సభకు తరలిరావడానికి భారీ ఉత్సాహాన్ని చూపిస్తున్నారని, ప్రజలు ఊహించని రీతిలో ఈ సభ అత్యంత విజయవంతం కాబోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# జూలై 1న గైనకాలజీ స్పెషలిస్ట్ వైద్యుల ఎంపికకు వాక్-ఇన్- ఇంటర్వ్యూ : డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్

**ఖమ్మం, జూన్ 30 (జర్నలిస్ట్ ఫైల్) :**

తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలోని మధిర ఏరియా ఆసుపత్రి, కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లలో ప్రజలకు గైనకాలజీ వైద్య సేవలు నిరంతరాయంగా అందించేందుకు అత్యవసర ప్రాతిపదికన జూలై 1న ఉదయం 11 గంటలకు వాక్-ఇన్- ఇంటర్వ్యూ ద్వారా గైనకాలజీ స్పెషలిస్ట్ వైద్యులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్) డాక్టర్ కె. రాజశేఖర్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.మధిర ఏరియా ఆసుపత్రికి ఒకరు, కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు ఒకరు చొప్పున మొత్తం ఇద్దరు గైనకాలజీ (ఓబిజి) స్పెషలిస్టులను ఎంపిక చేయనున్నట్లు అన్నారు. ఎంపికైన ప్రతి వైద్యునికి నెలకు లక్ష రూపాయల గౌరవ వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఎంబీబీఎస్‌తో పాటు ఎంఎస్ (ఓబి అండ్ జివై ) ఉత్తీర్ణులై ఉండాలని, సంబంధిత విభాగంలో అదనపు అర్హతలు, సాధారణ పని అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులు లేదా ఇతర ప్రభుత్వ వైద్య సంస్థల్లో గైనకాలజీ విభాగంలో పనిచేసిన అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.ఈ నియామకాలు రెగ్యులర్, కాంట్రాక్ట్ లేదా ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీ కాదని, ప్రజల అత్యవసర వైద్య అవసరాల దృష్ట్యా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో కేవలం రెండు నెలల కాలానికి మాత్రమే తాత్కాలిక సేవల కోసం చేపడుతున్న చర్య అని స్పష్టం చేశారు. వాక్-ఇన్-ఇంటర్వ్యూ జూలై 1, 2026 తేదీన ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ ఖమ్మంలోని జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం, మొదటి అంతస్తు, రూమ్ నంబర్ ఎఫ్ – 2లోని సూపరింటెండెంట్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, గత ప్రభుత్వ సేవల అనుభవ ధ్రువపత్రాలు, రెండు సెట్ల అటెస్టెడ్ జిరాక్స్ ప్రతులు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో నిర్ణీత తేదీ, సమయానికి నేరుగా వాక్-ఇన్-ఇంటర్వ్యూ కు హాజరుకావాలని సూచించారు.పూర్తి వివరాలు, దరఖాస్తు నమూనా కోసం ఖమ్మం జిల్లా అధికారిక వెబ్సైటు https://khammam.telangana.gov.in ను సందర్శించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్ ఆ ప్రకటనలో తెలిపారు.

# సర్ -2026 హౌస్ టు హౌస్ ఎన్యుమరేషన్ పరిశీలన





**ఖమ్మం, జూన్ 30 (జర్నలిస్ట్ ఫైల్) :**

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ –2026) కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న హౌస్ టు హౌస్ ఎన్యుమరేషన్ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా వివిధ పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో ఇంటింటికీ వెళ్లి బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓ లు) నిర్వహిస్తున్న ఎన్యుమరేషన్ ప్రక్రియను పరిశీలించారు. బిఎల్ఓ లు ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు, అవగాహన కరపత్రాలను సక్రమంగా పంపిణీ చేస్తున్నారా, ఫారం నింపే విధానాన్ని ఓటర్లకు స్పష్టంగా వివరిస్తున్నారా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా అనే అంశాలను స్వయంగా పరిశీలించి, ఓటర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.అలాగే పోలింగ్ స్టేషన్‌ల వారీగా మొత్తం ఓటర్ల సంఖ్య, పూర్తయిన మ్యాపింగ్, పెండింగ్ మ్యాపింగ్ వివరాలను సంబంధిత బిఎల్ఓ లు, సూపర్వైజర్లను అడిగి తెలుసుకుని పనుల పురోగతిని సమీక్షించారు.ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ శాతం తక్కువగా ఉన్న పోలింగ్ స్టేషన్‌లపై ప్రత్యేక దృష్టి సారించిన కమిషనర్ సంబంధిత బిఎల్ఓ లను కారణాలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటు హక్కు ఉండి ప్రస్తుతం ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను గుర్తించి, వారిని ఫోన్ ద్వారా సంప్రదించి సంబంధిత ప్రాంతాల బిఎల్ఓ లతో సమన్వయం చేసుకుని ఎన్యుమరేషన్ ఫారాలు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే తక్కువ పంపిణీ శాతం ఉన్న బిఎల్ఓ లకు సంబంధిత సూపర్వైజర్లు నిరంతరం మార్గనిర్దేశం చేస్తూ, పనులను పర్యవేక్షించి నిర్దేశిత గడువులోగా ఫారాల పంపిణీ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎన్యుమరేషన్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, ప్రతి అర్హత కలిగిన ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదయ్యేలా బిఎల్ఓ లు బాధ్యతాయుతంగా పనిచేయాలని కమిషనర్ సూచించారు.

# మామిళ్ల గూడెంలో పారిశుద్ధ్య నిర్వహణపై మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ



**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) :** ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెం ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆకస్మికంగా పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. రోడ్ల శుభ్రత, డ్రైనేజీల పరిశుభ్రత, ఇంటింటి చెత్త సేకరణ విధానం, ట్రాక్టర్ల పనితీరు తదితర అంశాలపై సంబంధిత శానిటేషన్ సిబ్బంది, జవాన్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు.రోజువారీగా ట్రాక్టర్ ఏ సమయం నుంచి ఏ సమయం వరకు పనిచేస్తోంది, ఇంటింటి చెత్త సేకరణ డివిజన్లో జరిగిందా ఈరోజు ఏ ఏ ప్రాంతాల్లో పనులు నిర్వహించారనే వివరాలను తెలుసుకొని అవసరమైన సూచనలు చేశారు.

# హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

- బలమైన సాక్ష్యాధారాలతో నేరాన్ని రుజువు చేసి, నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు
- సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్



**సంగారెడ్డి, (జర్నలిస్ట్ ఫైల్) :**సంగారెడ్డి జిల్లా కొండాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హత్య కేసులో నిందితుడికి సంగారెడ్డి ఫ్యామిలీ కోర్టు, నాల్గవ అదనపు జిల్లా & సెషన్స్ జడ్జి శ్రీ ఎం. సతీష్ కుమార్ గారు నిందితునికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు మొత్తం రూ.2,200 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. వివరాల్లోకి వెళితే, కొండాపూర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.134/2024, ఎస్.సి. నెం.22/2025, భారతీయ న్యాయ సంహిత (BNS) సెక్షన్లు 103, 118(1), 238 కింద నమోదు చేసిన కేసులో నిందితుడు పద్మటి అశోక్ రెడ్డి (32), మునిదేవునిపల్లి గ్రామం, కొండాపూర్ మండలం, నిందితుడు భూమి అమ్మిన విషయమై అడ్డుకోవడంతో తన తండ్రి పద్మటి మాధవరెడ్డిని హత్య చేసినట్లు దర్యాప్తులో నిర్ధారణ అయింది. ఈ కేసులో పోలీసులు శాస్త్రీయ పద్ధతిలో దర్యాప్తు నిర్వహించి, పటిష్టమైన సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో సమర్పించడంతో పాటు, ప్రభుత్వ న్యాయవాది సమర్థవంతమైన వాదనలు వినిపించడంతో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధించబడిందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసులో ప్రభుత్వ తరపున సమర్థవంతంగా వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ బి. శ్రీరాములు, కేసు నమోదు చేసిన అప్పటి ఎస్‌హెచ్‌ఓ సి. హరిశంకర్ గౌడ్, దర్యాప్తు అధికారి ఎస్. చంద్రయ్య, అప్పటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్, తుది దర్యాప్తు పూర్తి చేసి అభియోగ పత్రం దాఖలు చేసిన డి. వెంకటేష్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ప్రస్తుత ఎస్‌హెచ్‌ఓ కె. సోమేశ్వరి, కోర్టు డ్యూటీ అధికారులు బసవరాజ్, కె. వెంకటేశ్వర్, లైజనింగ్ అధికారి కె. సత్యనారాయణ, ఎస్.ఐ., తదితరులను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు.

# ఉపాధ్యాయునికి విశ్రాంతి ఉండదు
## - ఎస్వీఐటీ పీడీ పండరీ



**సికింద్రాబాద్,(జర్నలిస్ట్ ఫైల్):** ఉపాధ్యాయునికి విశ్రాంతి ఉండదని ఎస్వీఐటీ పీడీ పండరీ అన్నారు. సోమవారం సికింద్రాబాద్కళాసీగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణితశాస్త్ర స్కూల్ అసిస్టెంట్ తుమ్మ శైలేందర్ పదవీవిరమణ చేశారు. ఈ కార్యక్రమానికి మ ఖ్య అతిదిగా హాజరైన పండరీ మాట్లాడుతూ... శైలేందర్ చిన్నప్పటి నుండి ఎంతో కష్టపడి పైకి వచ్చిన వ్యక్తి అని, విద్యపై మక్కువతో 30 సంవత్సరాలకు పైగా ఉపాద్యాయ వృత్తిలో కొనసాగారన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు మాట్లాడుతూ.... భారతీయ విద్యా శిక్షాక్ సేవా దళ్ పేరిట ఏర్పాటు చేసిన స్వచ్ఛంద సేవా సంస్థ తరఫున ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారని, 1996లో విద్యాశాఖలో చేరిన శైలేందర్ మల్లెపల్లి, తాడ్ బంద్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించి 2012లో స్కూల్ అసిస్టెంట్ గా పదోన్నతి పొంది ఆలియ. బోరబండ ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన చేసి చివరికి తాను పుట్టిన ప్రాంతమైన రాంగోపాల్ పేట్ డివిజన్ లోని కళాసీగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ చేయడం అమోఘమని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాలతిబాయి. పూర్వ హెచ్ఎం యాకూబ్ చారి. హస్మత్ పేట్ జిల్లా పరిషత్ హెచ్ఎం విజయసింహ, ఎస్ టి యు మండల అధ్యక్షులు భూపాల్, పిఈటి రమేష్ గౌడ్, ఇతర ఉపాధ్యాయులు, టి ఆర్ టి ఎఫ్, ఎస్ టి యు తదితర ఉపాధ్యాయ సంఘాల నాయకులు. బంధువులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలిచ్చింది
## - నేడు కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలను లాక్కుంటుంది

- 19 ఏళ్ల అన్యాయం పేదలకు న్యాయం కావాలి
- 60 గజాల స్థలాల పట్టాలు వెంటనే పంపిణీ చేయాలి
- టిఆర్ఎస్ పార్టీ చేవేళ్ల నియోజకవర్గం నాయకులు బేగరి రాజు
- టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కుమ్మరి శివ శంకర్
- టిఆర్ఎస్ పార్టీ మొయినాబాద్ మున్సిపాలిటీ అధ్యక్షులు యండి అన్వార్ ఖాన్
- మొయినాబాద్ ప్రజల శాంతియుత ఉద్యమానికి టిఆర్ఎస్ మద్దతు



**మొయినాబాద్, (జర్నలిస్ట్ ఫైల్) :** మొయినాబాద్ మున్సిపాలిటీ హిమాయత్ నగర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 60 గజాల స్థలాల కోసం రిలే నిరాహార దీక్ష నాల్గవ రోజు సందర్భంగా మొయినాబాద్ మండల టిఆర్ఎస్ పార్టీ పూర్తి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ సభాధ్యక్షులు కట్టమీద శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభను ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కుమ్మరి శివశంకర్, టిఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం నాయకులు బ్యాగరి రాజు మాట్లాడుతూ,2007లో మంజూరైన 60 గజాల ఇంటి స్థలాల పట్టాలు ఇప్పటికీ అందకపోవడం పేదల పక్షాన ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతుందని అన్నారు 19 సంవత్సరాలుగా కాలయాపన చేస్తూ హక్కును ఇకపై ఆలస్యం చేయకుండా తక్షణమే అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.గృహ స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలి. పేదలకు న్యాయం జరగాలి.ఈ ఉద్యమం శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగుతుందన్నారు తక్షణమే ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పట్టాలు ఇచ్చి స్థలం చూపించాలని లేనిపక్షంలో ఆందోళన ఉద్ధృతం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు షేక్ మహ్మద్ నూర్ భాయ్, తెలంగాణ జాగృతి మొయినాబాద్ మండల అధ్యక్షులు నాగేష్,ఏనుగుల సంజీవరెడ్డి, బొక్క సురేందర్ రెడ్డి, టిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు ప్రవీణ్,బొక్క రవీందర్ రెడ్డి కావాలి శ్రీనివాస్ ముదిరాజ్, దర్శన్ గౌడ్, యండి యూనుస్,బోనాల ప్రభాకర్, గాండ్ల సంతోష్ కుమార్, టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నిర్వాకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీల హాజరు అవకతవకల పై విచారణ



**మొయినాబాద్, (జర్నలిస్ట్ ఫైల్) :** ధర్పల్లి మండల గ్రామ సచివాలయంలో ఉపాధి హామీ కూలీల హాజరుపై సోమవారం ఏపీడీ ఓంపాల్, ఫైనాన్స్ మేనేజర్ లక్ష్మీప్రసాద్ విచారణ చేపట్టారు. పత్రికలో వచ్చిన కథనంపై కూలీలు పనికి హాజరయ్యారా లేదా అనే అంశాన్ని వ్యక్తిగతంగా ఆరా తీశారు. పనుల అమలులో పారదర్శకత, నిబంధనల పాటింపును పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం లో పలువురు నాయకులు పాల్గొన్నారు

# "సర్" ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ పత్రాలను ఇంటింటికీ పంపిణీలో పురపాలక వైస్ చైర్మన్ ఏకు దివ్య విద్యాసాగర్





**వరంగల్,(జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్(సర్)కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవం తంగా నిర్వ హించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు,రాజకీయ పార్టీ లు సమన్వయంతో పని చేయాలని పురపాలక సంఘం పరకాల వైస్ చైర్మన్ ఏకు దివ్య విద్యాసాగర్ సూచించారు. హనుమకొండ జిల్లా పురపాలక సంఘం పరకాల పట్టణంలో 4వ వార్డు 51 బూత్ లో ఎన్యూమరేషన్ ఫారం సమర్పించే సౌకర్యాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పిం చింది. ఈ నెల 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా బూత్ స్థాయి అధికారు(బీఎల్‌వో)లు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను సోమవారం 4వ వార్డు కౌన్సిలర్,వైస్ చైర్మన్ ఏకు దివ్య విద్యాసాగర్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా దివ్య విద్యాసాగర్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రాల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించింది. ఓటరు జాబితాను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయడమే ధ్యేయంగా ఈ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోందని ఆయన అన్నారు.ఈ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓ) నేరుగా ఓటర్ల ఇళ్లకు వచ్చి క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతుంటారు.అర్హులైన కొత్త ఓటర్లను జాబితాలో చేర్చడం, మరణించిన వారి లేదా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళిన వారి పేర్లను తొలగించడం, అలాగే ఓటరు కార్డులలోని తప్పులను సవరించడం ఈ ఇంటింటి సర్వే యొక్క ముఖ్య ఉద్దేశ్యం. ఈ సమయంలో ఓటర్లు తమ పేరును ధృవీకరించుకోవడానికి లేదా సవరణల కోసం అధికారులకు ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ , చిరునామా ఆధారాలను చూపించాల్సి ఉంటుందని ఆయన ఓటర్ దరఖాస్తారులను కోరారు ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ పోరండ్ల వేణు, 4వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్,51వ బూత్ బీఎల్‌ఏ బొచ్చు కుమార్, బిఎల్ఓ సునీత, ఏకు హరి, ఓటర్ దారులు పెండెల సమ్మక్క పోచయ్య,హుస్సేన్ రమేష్ పాల్గొన్నారు.

# ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండాలి
## - కాంగ్రెస్ నాయకులు



**కేశంపేట, (జర్నలిస్ట్ ఫైల్) :** భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్–2026) కార్యక్రమంలో భాగంగా కేశంపేట మండలం కోనాయిపల్లి గ్రామంలో ఓటరు నమోదు, అవగాహన కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఆర్ ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్‌లు చల్లా శ్రీకాంత్ రెడ్డి, మహమ్మద్ ఇబ్రహీం, కేశంపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అనుమగల్ల రమేష్, మాజీ మండల అధ్యక్షుడు గూడ విరేష్ పాల్గొని ప్రజలకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి యువతీ, యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వారు తమ పేరు, చిరునామా, కుటుంబ వివరాలు, ఇతర వ్యక్తిగత సమాచారాన్ని ఒకసారి పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని కోరారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పనలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. గ్రామాల్లో అర్హులైన ఒక్కరూ ఓటరు జాబితాకు దూరం కాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు నర్సింహరెడ్డి, గ్యార సురేష్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మాఘ పౌర్ణమి వేళ గంగమ్మ తల్లి ఆలయంలో భక్తి పారవశ్యం

**ప్రత్యేక పూజలు, అన్నసత్రం నిర్వహించిన ఆలయ కమిటీ**

**శోభాయాత్రలో అధిక సంఖ్యలో పాల్గొనాలని గ్రామస్థులకు పిలుపు**



**నిజామాబాద్ రూరల్, (జర్నలిస్ట్ ఫైల్):** సిరికొండ మండల కేంద్రంలోని ఎల్లమ్మ చెరువు కట్టపై వెలసిన గంగమ్మ తల్లి ఆలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా సోమవారం గంగపుత్ర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నసత్ర కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రసాదాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, సాయంత్రం నిర్వహించే శోభాయాత్రతో పాటు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాలొని గంగమ్మ తల్లి ఆశీస్సులు పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రదీప్, సతీష్, అమర్, గంగాధర్, అశోక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ పోలీసు సేవలతో ప్రజలకు మరింత చేరువ కావాలి



○ ఎస్పీ వకుల్ జిందాల్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించాలనే లక్ష్యంతో గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం కొత్తపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణ, పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలు, ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలు, కార్యాలయ నిర్వహణను పరిశీలించారు. అనంతరం వివిధ రికార్డులు, రిజిస్టర్లు, కేసు సంబంధిత పత్రాలను తనిఖీ చేసి వాటి నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు.

పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ, దర్యాప్తులను నాణ్యతతో నిర్ణీత గడువులో పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి కేసులో చట్టపరమైన విధివిధానాలను కచ్చితంగా పాటిస్తూ సమర్థవంతమైన దర్యాప్తు నిర్వహించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ ఆస్తులు, కేసు ఆస్తుల నిర్వహణను స్వయంగా పరిశీలించి, వాటిని నిబంధనల ప్రకారం భద్రపరుస్తూ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని అధికారులకు ఆదేశించారు.

అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమైన ఎస్పీ వారి విధి నిర్వహణ, ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ప్రతి ఫిర్యాదుపై బాధ్యతాయుతంగా స్పందించాలని, క్రమ శిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా సేవలందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ల పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడం, దర్యాప్తు నాణ్యతను పెంపొందించడం, రికార్డుల నిర్వహణలో పారదర్శకత పాటించడం, పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడం జిల్లా పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, కొత్తపేట సీఐ వీరయ్య, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మహిళా గ్రీవెన్స్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశాల మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో తెలుగు మహిళా అధ్యక్షురాలు ముత్తినేని శివలీల, ప్రధాన కార్యదర్శి చెంబేటి మణికుమారి ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి వినతులు, అర్జీలు స్వీకరించారు. ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను నమోదు చేసుకుని ఎమ్మెల్యే గళ్ళా మాధవి దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని వారు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, భద్రత, సాధికారత కోసం ప్రభుత్వం మరియు ప్రజాప్రతినిధులు కట్టుబడి పనిచేస్తున్నారని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఇలాంటి గ్రీవెన్స్ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, ప్రజలు నిర్భయంగా తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు.

## యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు 'ఈఎస్‌డీపీ' శిక్షణలు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'ర్యాంప్' పథకం ద్వారా 'ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కమ్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్' (జూణూ) కింద ఉచిత శిక్షణలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి తెలిపారు. ఈ పథకం కింద తొలి 10 రోజులు పారిశ్రామికవేత్తగా ఎదగడానికి అవసరమైన అవగాహన, వ్యాపార నిర్వహణపై శిక్షణ, అనంతరం మరో 10 రోజులు సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించి, శిక్షణ పూర్తిచేసిన వారికి ధ్రువపత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు.

ఈ శిక్షణలకు ఇంజినీరింగ్, డిగ్రీ, మేనేజ్‌మెంట్, ఫార్మసీ, డిప్లొమా, ఐటీఐ చివరి సంవత్సరం విద్యార్థులతో పాటు ఎస్సీ, ఎస్టీ, మహిళలు, బీపీఎల్ వర్గాలు, మాజీ సైనికులు, దివ్యాంగులు, 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని తెలిపారు. స్వయం ఉపాధి, చిన్న పరిశ్రమల స్థాపనపై ఆసక్తి ఉన్న వారికి ఈ శిక్షణలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆమె పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా, థ్రెడ్జ్ ఐటీ సంస్థ ఆధ్వర్యంలో తెనాలిలోని సృజేర గ్లోవర్స్ ట్రైనింగ్ సెంటర్‌లో 30 మంది నిరుద్యోగ మహిళలకు 'ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ టైలరింగ్' కోర్సులో శిక్షణ జూలై 1 నుంచి ప్రారంభం కానున్నట్లు సంస్థ జనరల్ మేనేజర్ గిరిధర్ తెలిపారు. రానున్న రోజుల్లో గుంటూరు జిల్లాలో మరిన్ని నైపుణ్యాభివృద్ధి కోర్సులను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శిక్షణల్లో పాల్గొనదలిచిన అభ్యర్థులు 8247892792 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## చేపల వేటకు విరామం

### జిల్లా మత్స్యశాఖ అధికారి నాగయ్య

**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** వైఎస్ఆర్ కడప జిల్లాలోని వ్యక్తిగత లైసెన్సులు జారీ చేయు జలశాయములు అనగా గండికోట, బ్రహ్మాసాగర్ జలాశయాలు మరియు సోమశిల వెనుక జలాలలో చేపల సహజ సంతానోత్పత్తి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, జూలై 1 నుండి ఆగస్టు 31 వం-కు (62 రోజులు) చేపల వేట పూర్తిగా నిషేధించబడినదని మత్స్య శాఖ ఉపసంచాలకులు కుచులపాటి నాగయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిషేధ కాలంలో ఏ వ్యక్తి అయిన పై జలాశయాలలో చేపల వేట నిర్వహించినా లేదా ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని కాబట్టి, లైసెన్స్ దారులు మరియు ప్రజలు నిషేధ కాలంలో చేపల వేటకు వెళ్లకుండా సహకరించగలర ని తెలిపారు.

# గుంటూరు పశ్చిమలో రేషన్ అక్రమాలకు తావులేదు : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

○ వారం రోజుల్లో ప్రతి రేషన్ షాపులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో రేషన్ బియ్యం అక్రమ రవాణా, దుర్వినియోగానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావులేదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో జిల్లా సరఫరాల అధికారి కోమలి పద్మ, డిప్యూటీ తహసీల్దార్ బేగ్, డీఎం నాగేశ్వరరావు, ఏఎం క్రాంతి, నగర పరిధిలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (సీఐలు)తో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... పేదలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం అక్రమంగా తరలింపు లేదా విక్రయానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను, పోలీసులను ఆదేశించారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. రేషన్ దుకాణాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే, నియోజకవర్గంలోని ప్రతి రేషన్ షాప్‌లో వారం రోజులలోపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం తప్పనిసరి అని ఆదేశించారు. కెమెరాల ఏర్పాటు ద్వారా పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించే అవకాశం ఉంటుందని, అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని తెలిపారు.

ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎలాంటి రాజకీయ ఒత్తిడులు ఉండవని స్పష్టం చేసిన ఎమ్మెల్యే, ఎవరైనా తమ పేర్లు లేదా ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పుకొని అక్రమాలకు పాల్పడేందుకు ప్రయత్నిస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారెవరికీ ఉపేక్ష ఉండదని హెచ్చరించారు. గతంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్న సందర్భాల్లో తమ పార్టీ నాయకులు స్వయంగా గుర్తించి పోలీసులకు అప్పగించిన ఘటనలను ప్రస్తావించిన ఎమ్మెల్యే, "అధికారులు చేయాల్సిన పనులను కూడా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకరం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు అందాల్సిన సరుకులు సక్రమంగా చేరేలా అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజా పంపిణీ వ్యవస్థకు భంగం కలిగితే తాను ఏమాత్రం సహించబోనని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తేల్చి చెప్పారు. ప్రజల హక్కులను కాపాడడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులకు చేరేలా చూడడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో రేషన్ పంపిణీ పూర్తిగా పారదర్శకంగా, అవినీతి రహితంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

# పేదలకు శాశ్వత నివాస పట్టాలివ్వండి

○ జీవో నంబర్ 30 అమలు చేయండి

○ అర్హుల గుర్తింపునకు తగిన సిబ్బందిని కేటాయించండి

○ కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మను కోరిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లాలో ఎన్నో దశాబ్దాలుగా ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న వారికి శాశ్వతంగా పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిఎమ్ సాయి కాంత్ వర్మ, ఆర్డీవో శ్రీనివాసరావును గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కలెక్టర్ ఆర్డీవో కార్యాలయాల్లో అధికారులను కలిసి విన్నవించారు. ప్రజా దర్బార్ లో గానీ, తాము క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్ళినప్పుడుగానీ ప్రజల నుంచి పట్టాల కోసం అధికంగా అర్జీలు వస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 30 ద్వారా పేదలకు శాశ్వత నివాస హక్కు కల్పించేందుకు అవకాశం ఇచ్చిందని వివరించారు. కనీసం సెంటు భూమి కూడా లేని నిరుపేదలు ప్రభుత్వానికి చెందిన వివిధ రకాల భూముల్లో నివాసం ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా అదే ప్రాంతాన్ని నమ్ముకొని గూడు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. ఇలాంటి వారికి శాశ్వత నివాస హక్కు కల్పించాలనే గొప్ప ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసిందని చెప్పారు. గుంటూరు నగరంలో సుమారు 21 వేల మంది నిరుపేదలు వివిధ రకాల ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని, వీరందరికీ పట్టాలు ఇచ్చి సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. గుంటూరు నగరంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ శాశ్వత ఇంటి పట్టాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీవో నెంబర్ 30 విడుదల చేసిందని తెలిపారు. ఇది అమలు చేసేందుకు తగినంత సిబ్బందిని కేటాయిస్తూ వేగవంతంగా పనులు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే నసీర్ వినతి మేరకు కలెక్టర్ సాయి కాంత్ వర్మ సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే జీవో నెంబర్ 30 ద్వారా అర్హులను గుర్తించేందుకు కసరత్తు చేస్తున్నామని, త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు.

## దివ్యాంగులకు అలిమ్కో సంస్థ అడిప్ పథకం కింద ఆర్టిఫిషియల్ కాళ్లు



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్ ):** కాళ్లు కోల్పోయిన ఇతర అంగవైకల్యం కలిగిన దివ్యాంగులకు అలిమ్కో సంస్థ అడిప్ పథకం కింద ఆర్టిఫిషియల్ కాళ్లు అందిస్తున్నట్టు వికలాంగుల సంక్షేమ శాఖ గుంటూరు అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్. వెంకటరమణప్ప తెలిపారు. స్థానిక కొత్తపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సదరం శిబిరానికి దాదాపు 35 మంది పైబడి దివ్యాంగులు వచ్చినట్టు ఆయన తెలిపారు. వీరందరిని అలింకో సంస్థ వైద్యులు డాక్టర్ తన్మె, డాక్టర్ కోమల్ పరీక్షించి అవసరమైన కొలతలతో ఆర్టిఫిషియల్ లెగ్స్ ఇచ్చేందుకు వైద్య సేవలు అందించారని ఆయన తెలియజేశారు. గుంటూరు జిల్లాలో పత్తిపాడు, మంగళగిరి, పొన్నూరు నియోజకవర్గలలో ఇప్పటికే ఈ సదరం క్యాంపులు ఏర్పాటు చేసి అవసరమైన పరీక్షలు నిర్వహించి ఆర్టిఫిషియల్ లెగ్స్ ఇచ్చేందుకు సన్నద్ధం చేసినట్టు ఆయనతెలిపారు. ఈరోజు తెనాలి మండల పరిషత్ కార్యాలయం, పట్టణ పరిధిలో చావాస్ గ్రాండ్ నందు ఈ శిబిరం నిర్వహించి లబ్ధిదారులను గుర్తించి అవసరమైన ఆర్టిఫిషియల్ లెగ్స్ ఇవ్వనున్నట్టు ఆయన పేర్కొన్నారు. బుధవారం తాడికొండ, గురువారం గుంటూరు తూర్పు మరియు పశ్చిమ నియోజకవర్గలలో ఈ సదరం క్యాంపులు నిర్వహించనున్నట్టు వెంకటరమణప్ప వెల్లడించారు. కార్యక్రమంలో అలింకో మరియు వికలాంగుల సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నా చివరి సెల్యూట్ నాస్నేహితుడు ఉమేష్ చంద్రకు: డిజిపి మాదిరెడ్డి ప్రతాప్


○ తెనాలిలో ఉన్న ఉమేష్ చంద్ర విగ్రహం సాక్షిగా ఉద్యోగ విరమణ చేసిన డిజిపి ప్రతాప్

○ ఉద్యోగ విరమణ చేస్తున్న డిజిపి ప్రతాప్ ను ఘనంగా సత్కరించిన పోలీస్ అధికారులు, స్థానిక ప్రజలు



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర డిజిపి పోలీస్ అధికారిగా విధులు నిర్వహించి ఉద్యోగవిరమణ చేస్తున్న మాదిరెడ్డి ప్రతాప్ మంగళగిరి డిజిపి కార్యాలయం నుండి సైకిల్ మీద తెనాలి ఉమేష్ చంద్ర విగ్రహం వరకు చేరుకొని తన స్నేహితుడు సీనియర్ ఐపీఎస్ అధికారి దివంగత ఉమేష్ చంద్ర విగ్రహంకు చివరి సెల్యూట్ చేసి ఉద్యోగ విరమణ చేశారు డీజీపీ మాదిరెడ్డి ప్రతాప్. ఈ సందర్భంగా ఆయన భావోద్వేకం తో తను ఉమ్మడి రాష్ట్రాల్లో వివిధ హోదాల్లో ప్రజలకు చేసిన సేవలను, రాష్ట్ర ప్రజలకు అందించిన శాంతి భద్రతల విషయాలను గుర్తు చేసుకున్నారు. తను దివంగత సీనియర్ ఐపీఎస్ అధికారి ఉమేష్ చంద్ర 1991 ఐపీఎస్ బ్యాచ్ కి చెందిన వారమని, ఉమేష్ చంద్ర మొదట ఏఎస్పీగా వరంగల్ లో బాధ్యతలు తీసుకుంటే, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఏఎస్పీగా పోస్టింగ్ తీసుకున్నట్లు ఆయన తెలియజేశారు. దూరంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో వివిధ వాదాల్లో రాష్ట్ర ప్రజలకు సేవలు చేసినట్లు ఆయన తెలియజేశారు. అదేవిధంగా ఉమేష్ చంద్ర తో ఉన్న అనుబంధాన్ని డిజిపి ప్రతాప్ గుర్తు చేసుకున్నారు. ఉమేష్ చంద్ర తో ఉన్న అనుబంధం కారణంగానే తెనాలిలో ఉన్న ఉమేష్ విగ్రహం వద్ద నా చివరి సెల్యూట్ చేసి ఉద్యోగ విరమణ చేయాలని నిర్ణయించుకున్నట్లు ఆయన తెలియజేశారు. తెనాలి పోలీస్ అధికారులు స్థానిక ప్రజలు తన పట్ల చూపిన ప్రేమాభిమానాలు మరిచిపోలేనివని ఇంతటి ఘనంగా సత్కరించిన తెనాలి ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు డిజిపి మాదిరెడ్డి ప్రతాప్ తెలియజేశారు. కార్యక్రమంలో తెనాలి పోలీస్ అధికారులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతి శుక్రవారం 'డ్రై డే' పాటించాలి



○ డెంగ్యూ నివారణకు ప్రజల సహకారం అవసరం

○ జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరాన్ని డెంగ్యూ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఇంటిలోనూ, పరిసరాల్లోనూ వారం రోజులకుపైగా నిల్వ ఉండే నీటిని తొలగించాలని, ప్రతి శుక్రవారం తప్పనిసరిగా 'డ్రై డే'గా పాటించాలని నగర ప్రజలకు గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ పిలుపునిచ్చారు. మంగళవారం నుంచి డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం ప్రారంభం సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, జూలై 1 నుంచి 31 వరకు జాతీయ డెంగ్యూ నిరోధక మాసోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో డెంగ్యూ వ్యాప్తి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

డెంగ్యూ వ్యాధి ఎడిస్ దోమ కాటు ద్వారా వ్యాపిస్తుందని, ఈ దోమలు ఇంటి పరిసరాల్లో నిల్వ ఉండే పరిశుభ్రమైన నీటిలో గుడ్లు పెడతాయని తెలిపారు. అందువల్ల కూలర్లు, డ్రమ్‌లు, బకెట్లు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, నీటి నిల్వ పాత్రలను వారానికి ఒకసారి ఖాళీ చేసి శుభ్రం చేయాలని సూచించారు. దోమతెరలు, దోమ నివారణ క్రీములు వంటి రక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

జీఎంసీ ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో వార్డుల వారీగా ఇంటింటి జ్వర సర్వేలు నిర్వహించి, అనుమానిత కేసులను గుర్తించి పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో యాంటీ లార్వా చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు.

ఆశా, ఏఎన్‌ఎంలు, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ల ద్వారా డెంగ్యూ నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి, ఒళ్లునొప్పులు, చర్మంపై ఎర్రటి మచ్చలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని, వైద్యుల సలహా లేకుండా స్వయంగా మందులు వాడరాదని సూచించారు.

## ఎరువుల వినియోగం తగ్గించి భూసారం కాపాడాలి

○ జిల్లా కలెక్టర్ సి.యం. సాయి కాంత్ వర్మ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** రసాయన ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించి భూసారాన్ని పరిరక్షించేందుకు వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తల సూచనలను రైతులు తప్పనిసరిగా పాటించాలని గుంటూరు జిల్లా కలెక్టర్ సి.యం. సాయి కాంత్ వర్మ సూచించారు. మంగళవారం పెదకాకాని మండలం తక్కెళ్ళపాడులోని రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించిన ఆయన, ఎరువుల వినియోగంపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం ఏపీ ఏఐఎంఎస్ (ఆగ్రా ఘా×మీా) యాప్ ద్వారా యూరియా, డీఏపీ ఎరువులను పంపిణీ చేస్తోందని, రైతులు ముందుగా రైతు సేవా కేంద్రాల్లో తమ పంట విస్తీర్ణాన్ని నమోదు చేసుకోవాలని తెలిపారు. కౌలు రైతులు కూడా భూయజమాని పట్టాదారు పాస్‌బుక్ లేదా ఇతర ఆధారాలతో పంట నమోదు చేసుకోవచ్చని, సీసీఆర్‌సీ కార్డు ఉన్నవారికే ఎరువులు అందిస్తారనేది సరికాదని స్పష్టం చేశారు. తక్కెళ్ళపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం గోదాం వద్ద ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ అధిక ఎరువుల వినియోగం వల్ల భూసారం దెబ్బతింటుందని, సాగు ఖర్చులు పెరుగుతాయని పేర్కొన్నారు. ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల సిఫారసుల మేరకు వరి, మిరప పంటలకు ఎకరానికి రెండు బస్తాల యూరియా, ఒక బస్తా డీఏపీ, పసుపు, అరటి, పత్తి పంటలకు మూడు బస్తాల యూరియా సరిపోతుందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గుతున్న నేపథ్యంలో ప్రభుత్వ విధానాలకు అనుగుణంగానే ఎరువుల పంపిణీ జరుగుతోందని, రైతులను ఇబ్బంది పెట్టే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని, వారి అభిప్రాయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. రైతు ప్రతినిధి జి. బూసి బాబు మాట్లాడుతూ తక్కెళ్ళపాడులో 60 శాతం మంది రైతులు పంట నమోదు చేసుకున్నారని, మిగిలిన వారు కూడా నమోదు చేసుకోవాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎరువుల అవసరం అధికంగా ఉంటుందని, కౌలు రైతులకు కూడా సకాలంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ పంట నష్టం సంభవిస్తే చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో కే. శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పద్మావతి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## కొండపాటూరు విద్యార్థులకు ఆర్టీసీ మాజీ ఉద్యోగుల వితరణ



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండపాటూరు పాఠశాల విద్యార్థులకు బాపట్లకు చెందిన ఆర్టీసీ రాష్ట్ర మాజీ ఉద్యోగ సంఘ నాయకులు నోటు పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్ ప్యాకెట్లు వితరణగా అందజేశారు. ఇదే స్కూల్లో చదువుకుని ఆర్టీసీలో కండెక్టరుగా ఉద్యోగ విరమణ చేసిన తిరుపతిరావుతో వీరంతా సోమవారం బాపట్ల నుంచి కొండపాటూరు వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కాకుమాను మండల విద్యా శాఖ అధికారి కె.ఎఫ్.కెన్నడీ ప్రసంగించారు. కొండపాటూరు స్కూలుకు ఇదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు వివిధ రకాలుగా సహాయ, సహకారులు అందజేస్తుండటం గొప్ప విషయమన్నారు. కేఎంసీ హాస్పిటల్ చైర్మన్ కాటూరి సుబ్బారావు హైస్కూలు భవన నిర్మాణానికి ఈపాటికే కోటి రూపాయలు డిపాజిట్ చేశారని, త్వరలో దాని నిర్మాణం పూర్తయితే అన్నిహంగులతో అది అందుబాటులోకి రానున్నదన్నారు. తన పరిధిలోని కొండపాటూరు పాఠశాల అన్ని విషయాల్లో ముందుందని ప్రశంసించారు. ఈ ఏడాది పదో తరగతికి వచ్చిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు పొందేలా కృషి చేయాలని సూచించారు. ఆర్టీసీ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ ఉద్యోగులకు పింఛన్లు తక్కువ స్థాయిలో వస్తున్నప్పటికీ విద్యార్థుల చదువులకు తోడ్పాటు అందించడం కోసం తాము వివిధ స్కూళ్లకు ఈ విధంగా వీటిని అందజేస్తూ సహకరిస్తున్నామని చెప్పారు.

హైస్కూలు అభివృద్ధి కమిటీ కన్వీనరు టీడీ ప్రసాద్ ప్రసంగిస్తూ తమ పాఠశాలకు అన్ని వనరులు సమకూరుతున్నందున విద్యార్థుల చేరిక గణనీయంగా పెరిగిందని అందుకు కృషి చేసిన ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గన్నపనేని రాఘవరావు, బాబురావు ఆర్టీసీ రాష్ట్ర ఉద్యోగుల సంఘ నాయకులు పీవీకే రామారావు, వై.శ్రీనివాసరావు, కె.తిరుపతి రావు, పి.ఆర్. కోటేశ్వరరావు, బి.వి.రమణ, పి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఎమ్యీవో కెన్నడీ విద్యార్థులతో కలిసి భోంచేసి ఆహార పదార్థాలు అన్నీ బాగున్నాయన్నారు. తమ పాఠశాలకు వితరణ అందజేసిన వారందరని ప్రధానోపాధ్యాయుడు ప్రకాశరావు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి ధన్యవాదాలు తెలిపారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## సీఎం చంద్రబాబును కలిసిన ఏపీ జ్యుడిషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్



○ జ్యుడిషియల్ జిల్లాల పునర్విభజన, కొత్త కోర్టుల ఏర్పాటుకు వినతి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాల పునర్విభజన తర్వాత తలెత్తిన సాంకేతిక పరమైన ఇబ్బందులను పరిష్కరించాలని, జ్యుడిషియల్ జిల్లాల పునర్విభజన, కొత్త కోర్టులను ఏర్పాటు చేయాలని ఏపీ జ్యుడిషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేసింది. ఈమేరకు క్యాంపు కార్యాలయంలో ఏపీ జ్యుడిషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సీఎంను కలిసి వివిధ అంశాలను వివరించారు. జ్యుడిషియల్ అధికారుల సమస్యలు, సంక్షేమం సహా అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కోరారు. జ్యుడిషియల్ అధికారుల కుటుంబ సభ్యులకు క్యాష్‌లెస్ వైద్య చికిత్స సౌకర్యాన్ని కల్పించటంతో పాటు సాఫ్ట్ లోన్ పరిమితిని కూడా పెంచాలని అసోసియేషన్ ప్రతినిధులు ముఖ్యమంత్రిని కోరారు.

అలాగే ఇంటి స్థలాలను కూడా కేటాయించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ ప్రతినిధులు తన దృష్టికి తెచ్చిన అంశాలపై సీఎం సానుకూలంగా స్పందించారు. కొత్త కోర్టుల ఏర్పాటు, జ్యుడిషియల్ జిల్లాల పునర్విభజన వంటి అంశాల గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ అంశాలన్నిటినీ దశలవారీగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని సీఎం అసోసియేషన్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఏపీ జ్యుడిషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.చక్రపాణి, ఉపాధ్యక్షులు జె. శ్రీనివాసరావు, కె.శైలజ, ప్రధాన కార్యదర్శి ఎన్.రమేష్ నాయుడు, సంయుక్త కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, కార్యవర్గ సభ్యుల వెన్నెల, రాధారాణి ముఖ్యమంత్రిని కలిశారు.

## వేమూరులో సమర్థవంతమైన పోలీసింగ్‌కు కృషి చేయాలి



○ నూతన సీఐ నఫీష్ బాషాకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సూచన

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** వేమూరు సర్కిల్‌కు నూతనంగా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (సీఐ)గా బాధ్యతలు స్వీకరించిన ఎస్.కె. నఫీష్ బాషా గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు నఫీష్ బాషాకు శుభాకాంక్షలు తెలియజేశారు. వేమూరు నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు సత్వర న్యాయం, పారదర్శక పోలీసు సేవలు అందించడంలో సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

నియోజకవర్గ ప్రజల భద్రత, సంక్షేమం కోసం పోలీసు శాఖకు తన పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దీనికి స్పందించిన సీఐ నఫీష్ బాషా ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు.

## రాష్ట్రంలోని 28 జిల్లాలకు బీజేపీ ఇన్‌ఛార్జిల నియామకం



○ తక్షణమే అమల్లోకి ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేసే దిశగా భారతీయ జనతా పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 28 జిల్లాలకు కొత్త జిల్లా ఇన్‌ఛార్జిలను నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ప్రకటించారు.

జిల్లా ఇన్‌ఛార్జిలు పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం, బూత్ కమిటీల బలోపేతం, సంస్థాగత విస్తరణ, సభ్యత్వ నమోదు కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై ఉద్యమాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, పార్టీ కార్యక్రమాల సమన్వయం వంటి బాధ్యతలను నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర నాయకులు, వివిధ మోర్చాల నాయకులతో సమన్వయం చేసుకుంటూ పార్టీని గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మరింత బలోపేతం చేయాలని పీవీఎన్ మాధవ్ సూచించారు.

రాష్ట్రవ్యాప్తంగా పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, శ్రీ సత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాలకు ఇన్‌ఛార్జిలను నియమించారు. పల్నాడు, నంద్యాల జిల్లాలకు కో–ఇన్‌ఛార్జిలను కూడా నియమించారు.

ఈ నియామకాలతో పార్టీ సంస్థాగత కార్యక్రమాలు మరింత వేగవంతం అవుతాయని, జిల్లా ఇన్‌ఛార్జిలు స్థానిక నాయకత్వంతో సమన్వయం చేసుకుంటూ పార్టీ విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేయడమే ఈ నియామకాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

## విజయనగరం జిల్లాలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేష్ పర్యటన

○ కేంద్ర మంత్రితో కలిసి భోగాపురంలో పీఎంశ్రీ ఏపీ మోడల్ స్కూల్ ను సందర్శించిన మంత్రి లోకేష్

○ పాఠశాలలో ఆధునిక విద్యా బోధన, మౌలిక వసతుల పరిశీలన

○ ఏపీ విద్యారంగం అభివృద్ధికి మంత్రి నారా లోకేష్ కృషిని అభినందించిన ధర్మేంద్ర ప్రధాన్





**భోగాపురం(జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో కలిసి రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ విజయనగరం జిల్లా భోగాపురంలోని పీఎంశ్రీ ఏపీ మోడల్ స్కూల్ ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆధునిక విద్యా బోధన, మౌలిక వసతులను మంత్రులు పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ముందుగా పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సి.పార్వతి, విద్యార్థులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

**పాఠశాలలో ఆధునిక విద్యా బోధన, మౌలిక వసతుల పరిశీలన :** పాఠశాల మొత్తం కలియతిరిగిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ వసతులను పరిశీలించారు. ముందుగా జాదు పిటారా కిట్ ను కేంద్ర మంత్రి పరిశీలించారు. జాదు పిటారా కిట్ గురించి సిబ్బంది, మంత్రి లోకేష్ కేంద్ర మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాల విద్యాశాఖ అందిస్తున్న స్టూడెంట్ ప్రోగ్రెస్ కార్డ్, అసెస్ మెంట్ బుక్ లెట్ ను కేంద్ర మంత్రికి లోకేష్ చూపించారు. విలువల విద్య కోసం ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు గారి ప్రవచనాలతో రూపొందించిన పుస్తకాల గురించి మంత్రి లోకేష్ విశదీకరించారు. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ ను ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పరిశీలించారు. టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, యూనిఫాం, స్కూల్ బ్యాగ్, షూ, బెల్ట్, సాక్స్ లను పరిశీలించారు. పిక్టోరియల్, ఆక్స్ ఫర్డ్ డిక్షనరీ గురించి సిబ్బంది వివరించారు.

**పాఠశాల విద్యాశాఖ డ్యాష్ బోర్డును పరిశీలించిన కేంద్ర మంత్రి :** ఈ సందర్భంగా విద్యాశాఖ రూపొందించిన డ్యాష్ బోర్డును కేంద్ర మంత్రి ఆసక్తిగా పరిశీలించారు. లీప్ డ్యాష్ బోర్డ్ గురించి మంత్రి లోకేష్ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కు వివరించారు. డ్యాష్ బోర్డ్ లో ఎన్ రోల్ మెంట్, లెర్నింగ్ అవుట్ కమ్స్, అటెండెన్స్, మధ్యాహ్న భోజన పథకం, ఎంఈవో, డీఈవోల ఇన్ స్పెక్షన్, డ్రాప్ అవుట్స్, లీప్ యాప్ డౌన్ లోడ్స్, స్మార్ట్ కిచేన్స్, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు భవిత సెంటర్స్, అకడమిక్, ఇన్ ఫ్రా స్ట్రక్చర్ పర్ఫార్మెన్స్ వంటి అంశాల గురించి విశదీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో తీసుకురానున్న స్మార్ట్ కిచేన్ల వ్యవస్థపై రూపొందించిన ఏవీని వీక్షించారు. కడపలో పైలట్ ప్రాజెక్ట్ గా చేపట్టిన స్మార్ట్ కిచెన్ గురించి కేంద్రమంత్రికి వివరించారు. అనంతరం స్పోర్ట్స్ రూమ్, స్కిల్ ల్యాబ్ ను మంత్రులు పరిశీలించారు. విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పైథాన్ లాంగ్వేజ్ ను ఉపయోగించి విద్యార్థి రూపొందించిన హోం వర్క్ అండ్ పీరియాడికల్ అసెస్ మెంట్ అప్లికేషన్ ను ఆసక్తిగా గమనించారు. ప్రీ ఒకేషనల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ గురించి సిబ్బంది వివరించారు. ఇందుకు సంబంధించిన కౌశల్ బోధ్ పుస్తకాలను కేంద్ర మంత్రి పరిశీలించారు. స్కూల్ లైబ్రరీని సందర్శించి విద్యార్థులతో సంభాషించారు. లైబ్రరీలోని పుస్తకాలపై కేంద్ర మంత్రి ఆరా తీశారు.

**చాణక్య అంటే ఎవరో తెలుసా? :** అనంతరం మంత్రులు పాఠశాలలోని 9వ తరగతి బీ సెక్షన్ ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల మధ్య కూర్చొని ఫిజియోగ్రాఫిక్ డివిజన్ ఆఫ్ ఇండియా అంశంపై రూపొందించిన క్లిక్కర్ వీడియోను వీక్షించారు. సదరు పాఠ్యాంశం గురించి ఉపాధ్యాయురాలు విద్యార్థులకు వివరించారు. క్లిక్కర్ వీడియోకు సంబంధించి ఫ్లిప్ ప్యానల్ ద్వారా క్విజ్ నిర్వహించగా 55 శాతం మంది విద్యార్థులు సరైన సమాధానాలు చెప్పారు. ఈ సందర్భంగా తరగతి గదిలోని విద్యార్థులతో కేంద్ర మంత్రి సంభాషించారు. ఈ రోజు ఏం టిఫిన్ తిన్నావని ఓ విద్యార్థిని ప్రశ్నించగా దోశ తిన్నానని సమాధానం ఇచ్చాడు. మధ్యాహ్న భోజనం గురించి ఆరా తీశారు. అనంతరం ఓ విద్యార్థి పేరు అడగ్గా చాణక్య అని చెప్పాడు. "చాణక్య అంటే ఎవరో తెలుసా? కింగ్ ఆ, కింగ్ మేకరా?" అని కేంద్ర మంత్రి ప్రశ్నించారు.

కింగ్ మేకర్ అని విద్యార్థి సమాధానం చెప్పాడు. మరో విద్యార్థి రాం ప్రసాద్ ను పాఠ్యాంశాలపై అనుమానాలు ఉంటే ఎవరిని అడుగుతావని ప్రశ్నించగా.. తన సోదరుడిని అడుగుతానని విద్యార్థి సమాధానం చెప్పాడు. ఏ భాష సౌకర్యంగా భావిస్తావని సదరు విద్యార్థిని ప్రశ్నించగా తెలుగు అని సమాధానం చెప్పాడు. ఈ సందర్భంగా బైలింగ్యువల్ టెక్స్ట్ బుక్స్ గురించి మంత్రి లోకేష్ వివరించారు. అనంతరం విద్యార్థి స్థాయి ఆధారంగా నేర్చుకునే పాల్ ల్యాబ్ ను పరిశీలించారు. విద్యార్థులను, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమ పేర్లతో రూపొందించిన త్రీడి ప్రింటింగ్ ను కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు ఓ విద్యార్థి బహుమతిగా అందజేశాడు.

ఏపీలో విద్యారంగం అభివృద్ధికి కృషిచేస్తున్న మంత్రి నారా లోకేష్ ను ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి, సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, డీఈవో మాణిక్యం, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి, చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకట్రావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున, మార్క్ ఫెడ్ రాష్ట్ర ఛైర్మన్ కర్రోతు బంగారు రాజు తదితరులు పాల్గొన్నారు.

## 'విఐటి-ఏపీ'లో 26 జిల్లాలకు చెందిన 50 మంది పేద విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు





○ స్టార్స్ పథకం కింద ట్యూషన్, హాస్టల్ ఫీజులకు పూర్తి మినహాయింపు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో 'విఐటి-ఏపీ' విశ్వవిద్యాలయం స్టార్స్ (సపోర్ట్ ది అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ రూరల్ స్టూడెంట్స్) పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లాలకు చెందిన 50 మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పించింది. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఈ విద్యార్థులకు ట్యూషన్ ఫీజులు, హాస్టల్ ఫీజులను పూర్తిగా మాఫీ చేస్తూ ఉన్నత విద్యాభ్యాసానికి అవకాశం కల్పించింది.

ఈ సందర్భంగా 'విఐటి-ఏపీ' వైస్ చాన్సలర్ డాక్టర్ పి. అరుళ్‌మొళివర్మన్ మాట్లాడుతూ విద్య జీవితాలను మార్చే శక్తివంతమైన సాధనమని, పేదరికాన్ని అధిగమించడానికి విద్యే ప్రధాన మార్గమని అన్నారు. స్టార్స్ పథకం ద్వారా దినసరి కూలీలు, చిన్న, సన్నకారు రైతులు, గృహ కార్మికులు, ఇతర ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు ప్రపంచ స్థాయి విద్యను అభ్యసించే అవకాశం పొందుతున్నారని తెలిపారు. విఐటి వ్యవస్థాపక ఛాన్సలర్ డాక్టర్ జి. విశ్వనాథన్ ఆలోచనతో 2008లో వెల్లూరులో స్టార్స్ పథకాన్ని ప్రారంభించగా, 2017 నుంచి విట్-ఏపీలో అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ పథకం కింద విద్యార్థులకు ట్యూషన్ ఫీజులు, హాస్టల్ వసతి పూర్తిగా ఉచితంగా అందించడంతో పాటు విద్యాభివృద్ధికి అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తున్నట్లు వెల్లడించారు. 'విఐటి-ఏపీ' రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ ప్రతిభ ఆర్థిక పరిస్థితులకు పరిమితం కాకూడదనే లక్ష్యంతో స్టార్స్ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు.

ఈ కార్యక్రమం ద్వారా సమాన విద్యావకాశాలు కల్పించడంతో పాటు సమాజంలో విద్యా సమానత్వాన్ని పెంపొందించేందుకు విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ (అడ్మిషన్స్) డాక్టర్ మనోజ్ కుమార్ మిశ్రా పాల్గొన్నారు.

## ముగ్గురికి రూ.4.88 లక్షల సీఎంఆర్ఎఫ్ వైద్య సాయం

○ వేమూరు నియోజకవర్గంలో లెటర్ ఆఫ్ క్రెడిట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



**వేమూరు(జర్నలిస్ట్ ఫైల్):** వేమూరు నియోజకవర్గానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) ద్వారా మంజూరైన రూ.4,88,327 వైద్య ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అందజేశారు.

అమృతలూరు, భట్టిప్రోలు మండలాలకు చెందిన బాధితులు వివిధ అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందగా, వారి వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్‌కు పంపిన దరఖాస్తులను ప్రభుత్వం పరిశీలించి ఎల్‌వోసీ ద్వారా ఆర్థిక సాయం మంజూరు చేసింది. అమృతలూరు మండలం కూచిపూడి గ్రామానికి చెందిన కూచిపూడి రవికిరణ్‌కు రూ.2 లక్షలు, భట్టిప్రోలు మండలం పెదలంక గ్రామానికి చెందిన బొరుగడ్డ కుమారికి రూ.1 లక్ష, కోళ్లపాలెం గ్రామానికి చెందిన నీలా కళ్యాణికి రూ.1,88,327 చొప్పున మొత్తం రూ.4,88,327 అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్సల కోసం భారీ ఖర్చులు భరించలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి గొప్ప భరోసాగా నిలుస్తోందని పేర్కొన్నారు. వేమూరు నియోజకవర్గంలోని ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అత్యవసర వైద్య అవసరాల సమయంలో అర్హులైన కుటుంబాలు ముఖ్యమంత్రి సహాయనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు అందిన ఆర్థిక సహాయానికి రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

## విశాఖకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాక



○ స్వాగతం పలికిన మంత్రి నారా లోకేష్

**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం విశాఖపట్నం చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో విశాఖకు చేరుకున్న రాష్ట్రపతికి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా ఆహ్వానించారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో విమానాశ్రయం పరిసరాల్లో అధికారులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రపతి పర్యటన విజయవంతం కావడానికి సంబంధిత శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాయి.

## ఎక్సైజ్ కానిస్టేబుళ్లకు న్యాయం చేసిన ప్రభుత్వానికి సంఘం కృతజ్ఞతలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లకు సబ్‌ఇన్‌స్పెక్టర్ పదోన్నతుల విషయంలో జరుగుతున్న అన్యాయంపై రాష్ట్ర ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్స్ అండ్ హెడ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. ఈ అంశంపై కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ (రెవెన్యూ, ఎక్సైజ్) స్పందించి విచారణ జరిపించిన అనంతరం, జి.ఓ.ఎం.ఎస్. నెం.394ను 2026 మే 29న జారీ చేసినట్లు సంఘం తెలిపింది.

ఈ ఉత్తర్వుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4,100 మంది కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లకు న్యాయం జరిగిందని సంఘం పేర్కొంది. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా, ఎక్సైజ్ కమిషనర్ సి. శ్రీధర్, అలాగే సహకరించిన ఇతర అధికారులకు సంఘం తరఫున కృతజ్ఞతలు తెలియజేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్స్ అండ్ హెడ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వి. రమణారావు, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి ఈ మేరకు ధన్యవాదాలు తెలిపారు.

## మెగా డీఎస్సీ--2025 స్పోర్ట్స్ కోటా ఉద్యోగ విజేతలకు ఘన సన్మానం

○ పారా స్పోర్ట్స్ లో దేశంలోనే నంబర్ వన్‌గా ఆంధ్రప్రదేశ్

○ రాష్ట్ర పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరుస్తూ రాష్ట్రాన్ని పారా స్పోర్ట్స్ లో దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిపారని రాష్ట్ర పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు గోనుగుంట్ల కోటేశ్వరరావు తెలిపారు.

విజయవాడ ఠాగూర్ గ్రంథాలయం వేదికగా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ--2025 స్పోర్ట్స్ కోటా ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన పారా క్రీడాకారులకు ఘన సన్మాన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ 2015 నుంచి ఇప్పటివరకు రాష్ట్ర పారా క్రీడాకారులు మొత్తం 512 పతకాలు సాధించగా, ప్రస్తుతం దాదాపు 1,000 మంది దివ్యాంగ క్రీడాకారులు వివిధ విభాగాల్లో పారా స్పోర్ట్స్ లో రాణిస్తున్నారని చెప్పారు. మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ద్వారా 15 మంది పారా క్రీడాకారులకు ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు లభించాయని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో పతకాలు సాధించిన విజేతలకు రూ.1.80 కోట్ల నగదు ప్రోత్సాహకాన్ని అందించింది ప్రోత్సహిస్తుందన్నారు. అలాగే రాబోయే కామన్వెల్త్ గేమ్స్ లో రాష్ట్రానికి చెందిన భవానీ కార్తీక్ ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొంటూ ఆయనకు అభినందనలు తెలిపారు. గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభావంతులైన పారా క్రీడాకారులను గుర్తించి వారికి శిక్షణ, ప్రోత్సాహం, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ సహకారం, అసోసియేషన్ కృషితో మరింత మంది దివ్యాంగ యువత అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా కృషి కొనసాగిస్తామని కోటేశ్వరరావు తెలిపారు.

ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ ఉద్యోగాలు సాధించిన పారా క్రీడాకారులను అభినందించారు. క్రీడా ప్రతిభకు ప్రభుత్వం ఇస్తున్న గుర్తింపు అభినందనీయమని, ఇది మరింత మంది దివ్యాంగ యువతను క్రీడల వైపు ఆకర్షించే స్ఫూర్తిదాయక నిర్ణయమని పేర్కొన్నారు.

అనంతరం మెగా డీఎస్సీ--2025 స్పోర్ట్స్ కోటా ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన పారా క్రీడాకారులను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ విజయోత్సవ సభ పారా క్రీడాకారులకు మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగ యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ డాక్టర్ మహమ్మద్ ఫారూక్ శిబిల్, ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.ఎస్. బేగ్, ఎన్‌టీఆర్ జిల్లా డీఎస్‌డీఓ కాకర్ల కోటేశ్వరరావు, సిట్టింగ్ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు బి. శివదత్తు, సమగ్ర శిక్ష శాఖకు చెందిన నరసింహారావు, ఠాగూర్ గ్రంథాలయం చీఫ్ లైబ్రేరియన్ శ్రీమతి రమాదేవి, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వి. రామస్వామి విశిష్ట అతిథులుగా పాల్గొని విజేతలను అభినందించారు.

రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శులు, క్రీడాకారులు, కోచ్‌లు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467